# కర్నూలు | నంద్యాల వార్త

22 నవంబర్ 2025 శనివారం పేజీలు 4


## నంద్యాల టిడ్కో ఇల్లును.. పరిశీలించిన మంత్రి



**నంద్యాల నవంబర్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం హయంలో టిడ్కో గృహాలను పూర్తి చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీడీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని వైసిపి ప్రభుత్వం ఒక చెడు ఆలోచనతో టిడ్కో ఇల్లును పూర్తి చేయలేదని ప్రచారాలు చేసిందని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ , మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యలూరు గ్రామంలో ఉన్న టిడ్కో ఇల్లును ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ లబ్దిదారుల పేరున బాంక్ రుణాలు సేకరించి, ఆడబ్బులను పక్కదారి పట్టించి, ఆయా లబ్దిదారులకు గృహాలను ఇయ్యక పోగా, వారిపై బ్యాంకు రుణాల భారం వైస్సార్సీపీ ప్రభుత్వం మోపిందన్నారు . ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పుడు ప్రజల తరఫున ప్రభుత్వం కడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన 20 నెలల కాలంలోనే లక్ష టిడ్కో గృహాలను అర్హులైన వాళ్లకు అందించేలా ప్రణాళిక రూపొందించి ఇస్తామని చెప్పారు. నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంఈ గుర్రప్ప, టిడ్కో హౌస్ అధికారులు , మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలతో జిల్లా అభివృద్ధి వేగవంతం

: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో పురోగతిపై దిశా కమిటీ సమావేశం




**కర్నూలు, నవంబర్ 21, ప్రభాతవార్త :** జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు, దిశా కమిటీ చైర్మన్ బస్తిపాటి నాగరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లాస్థాయి దిశా కమిటీ సమావేశంలో వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. సమావేశంలో మాట్లాడుతూ ఎంపీ బస్తిపాటి నాగరాజు దేవనకొండ, ఆస్పరి, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ మండలాలు కూరగాయల ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నందున అక్కడ రూరల్ హాట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు మండలాల వారీగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే కర్నూలు మార్కెట్ యార్డులో ఆగిపోయిన మల్టీ కోల్డ్ స్టోరేజ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో ప్రధాన మంత్రి కృషి సంచాయి యోజన నిధులు నిలుపుదలైన అంశంపై విచారించి, సంబంధిత నివేదికలు అందిస్తే నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ త్వరలో అందుబాటులోకి రానుందని వెల్లడించారు. ఆస్పరి మండల తాగునీటి సమస్యపై..

2లో

# దూది రైతుకు.. దుఃఖమే..!

- రైతుల శ్రమ.. దళారుల దోపిడీ..
- అడుగడుగునా దోపిడీకి గురవుతున్న పత్తి రైతులు
- అనుమతులు లేకున్నా మధ్య దళారుల పత్తి వ్యాపారం
- ధర ఎక్కువ ఇస్తామని నమ్మించి మోసం
- తూకాల్లో మోసాలు చిత్తు కాగితాల్లోనే బిల్లులు
- సీసీఐ అందుబాటులోకి తీసుకువచ్చినా..

విక్రయాల్లో జాప్యం..!







రైతు ఆశాజీవి.. ఎప్ప టికైనా గిట్టుబాటు ధర రాకపోతుందా అని ఆరుగాలం కష్టించి పంట పండిస్తే చివరికి కన్నీరే మిగులుతోంది. ఈసారి అకాల వర్షాలు, చీడపీదల కారణంగా.. అశిం చిన స్థాయిలో దిగుబడి రాలేదు. దానికితోడు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. మార్కెట్లో దళారులు, అధికారులు కుమ్మక్కై ధర తగ్గించి రైతును నిలువునా ముంచు తున్నారు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పత్తిని అధికంగా పండించే అన్నదాతల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచ రంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన రైతు నిలువునా దోపిడీకి గురవుతున్నాడు. దేశానికి పట్టెడన్నం పెట్టే అన్నదాతనే నడ్డీ విరుస్తున్నారు. అడుగడుగునా రైతు కుదేలవుతున్నా కృంగిపోవడం తప్ప ఆదుకునే నాథుడే కరువయ్యారు. ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలు రైతు జీవితంతో ఆటలాడు కుంటున్నాయి. ఆదుకోవాల్సిన పాలకులు పట్టించుకొవడం లేదు. పండించిన పంటకు మద్దతు ధర కల్పించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కర్నూలు ప్రభాతవార్త ప్రతినిధి :**

విత్తనం వేసింది మొదలు పంట చేతికొచ్చేదాకా రైతులను దగా చేస్తున్నారు. పండించిన పంటపై వచ్చే ప్రతిఫలాన్ని రైతులు దక్కించుకోలేకపోతున్నారు. మధ్యదళారులు రైతులను నట్టేట ముంచి వచ్చిన లాభాన్ని దేగల్లా తన్నుకుపోతున్నారు. ఏమార్కెట్లో చూసినా ఇదే తంతు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతిక రాక తల్లడిల్లుతుంటే, అప్పనంగా వచ్చిన వ్యాపారులు రైతు శ్రమను సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో పత్తి సాగు ఏటకేటకు పెరుగుతుంది. ఏదో ఒక రోజు భూతల్లి తమను గడ్డన వేయకపోతుందా అంటూ నేల తల్లిని..

• వివరాలు 2లో

## అహోబిలంకు భద్రత మరింత బలోపేతం

– ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్



**ఆళ్లగడ్డ, నవంబరు 21, ప్రభాతవార్త:** అహోబిలంలో భక్తుల భద్రత, దేవాలయం భద్రత మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ పేర్కొన్నారు. శుక్రవారంస్థానిక అహోబిలంలో ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ పర్యవేక్షణలో పోలీస్‌శాఖ, అటవీశాఖ, అహోబిలం దేవాలయం నిర్వహణ కలిసి సమగ్ర భద్రత సమావేశం నిర్వహించారు. ఈసమీక్షలో అన్నిశాఖలు కలిపి ప్రస్తుతం అమలులో ఉన్న భద్రత ఏర్పాట్లను పరిశీలించి అహోబిలం పవిత్ర క్షేత్రానికి వచ్చే వేలాది మంది భక్తులకూ పూర్తి భద్రత కల్పించేందుకు పలు చర్యలను చర్చించారు. అహోబిల పరిసరాలు, దేవాలయ ప్రదేశ నిస్క్రమణ ద్వారాలన్ని కంట్రోల్ రూంకు అనుసంధానమై సీసీ టివి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించబడతాయి. అహోబిలం ప్రాంతంలో అనుమానస్పద కదలికలను గమనించేందుకు కంట్రోల్ రూంలో 24 గంటలు పోలీస్ సిబ్బందిని విధుల్లో పెట్టాలని నిర్ణయించారు. అలాగే దేవాలయ దర్శనం ముందు భక్తులు తమ లగేజీ, మొబైల్ ఫోన్లు ఉంచుకునేందుకు ప్రత్యేక క్లాక్ రూం ఏర్పాటు చేయబడుతుంది, అత్యవసర ఎవాక్యుయేషన్ ప్లాన్‌లను సమీక్షించారు. ఈసమావేశంలో దేవాలయ మేనేజర్ సుందరరాజన్, ఆళ్లగడ్డ రూరల్ సిఐ మురళీధర్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజ అఫీసర్ ముర్తుజావలి, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సిఐ జె. శంకరయ్యను డిస్మిస్

: క్రమశిక్షణా చర్యల మేరకు విధుల నుండి తొలగింపు

: కర్నూల్ రేంజ్ డీఐజీ ఉత్తర్వులపై జిల్లా ఎస్పీ నిర్ణయం

**కర్నూలు, నవంబర్ 21, ప్రభాతవార్త :** కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు వి.ఆర్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ జె. శంకరయ్యను పోలీస్ శాఖ సేవల నుంచి డిస్మిస్ చేస్తూ కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా ఎస్పీ ఈ చర్యను అధికారికంగా ప్రకటించారు. పులివెందుల పట్టణంలో వైయస్ వివేకానంద రెడ్డి హత్య సమయంలో శంకరయ్య అక్కడ ఇన్స్పెక్టర్ గా పని చేశారు. అప్పటి వివాదాల్లో ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. అదే క్రమంగా ఇటీవల చంద్రబాబు నాయుడుకు సైతం శంకరయ్య లీగల్ నోటీసులు పంపించి సంచలనం సృష్టించారు. ఈ విషయాల నేపథ్యంలో ఆయనను కర్నూలు జిల్లా వేకెన్సీ రిజర్వులో ఉంచారు. తాజాగా కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ విచారించి తీసుకున్న నిర్ణయాల మేరకు ఆయనపై చర్యలు తీసుకున్నారు. క్రమశిక్షణ పరమైన కారణాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు.

## జిల్లాలో మత్స్యకారుల సంక్షేమానికి.. ప్రత్యేక చర్యలు

: జిల్లాలో మత్స్యసంపద పెంచి మత్స్యకారుల జీవితాలలో వెలుగులు

**నంద్యాల, నవంబర్ 21 ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేకతలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు జిల్లా మత్స్యశాఖ వారి ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. నంద్యాల వ్యవసాయ అనుబంధ శాఖలపైన ఆధారపడిన జిల్లా మన జిల్లాలో ఎక్కువగా హార్టికల్చర్, లైవ్ స్టాకు, అగ్రికల్చర్ తర్వాత ఆక్వారంగం ద్వారా జిల్లాకు జిడిపి ఎక్కువగా వస్తుందన్నారు. జిల్లాలో 65వేల మెట్రిక్ టన్నులు చాపల ఉత్పత్తి ఉందన్నారు. ఈ ఏడాది 80 వేల మెట్రిక్ టన్నులకు పెంచాలన్న ఆలోచనతో జిల్లా యంత్రాంగం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లాలో 330 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయని కానీ 110 ట్యాంకులలోనే చేపల పెంపకం జరుగుతోందని చేపల పెంపకం రిజర్వాయర్లు చెరువుల ద్వారా పెంచితే మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి పెరిగి జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ దిశగా చెరువులలో మరింత చేపల పెంపకం చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఫిష్ నర్సరీస్ ని అభివృద్ధి చేయడం జరిగిందని వచ్చే సంవత్సరానికి మరింత అభివృద్ధి చేసి జిల్లాకు కావలసిన చేపపిల్ల ఉత్పత్తిని మన జిల్లాలోనే




జరిగి మత్స్యకారులందరికీ అందించడం జరుగుతుందన్నారు. కోస్టల్ వారికి ఇచ్చిన బెనిఫిట్స్ అన్ని కూడా మన జిల్లాలో ఇచ్చేందుకు ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 50సంవత్సరాలు పూర్తయిన మత్స్యకారులకు పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వ నియమ నిబంధనలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యకరమైన ప్రోటీన్లు ఎక్కడ దొరకవన్నారు. మనుషుల్లో తెలివితేటలు, పిల్లల మెదడు చురుకుగా పనిచేయాలంటే, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ చేపలు తినాలన్నారు.

## అభివృద్ధికి.. నిధులు ఇచ్చి సహకరించండి

: మంత్రి నారా లోకేష్ ను కోరిన వైకుంఠం జ్యోతి

**చిప్పగిరి, నవంబర్, 21, ప్రభాతవార్త :** ఆలూరు నియోజకవర్గం అభివృద్ధికి నిధుల ఇచ్చి ఆదుకోవాలని ఆలూరు టిడిపి ఇన్చార్జి వైకుంఠం జ్యోతి, మంత్రి నారా లోకేష్ ను కోరింది. శుక్రవారం అమరావతి లో మంత్రి నారా లోకేష్ ను ఇన్చార్జి వైకుంఠం జ్యోతి దంపతులు ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేసింది. ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గంలో మండలాల్లో మండలాల్లో అభివృద్ధికి కావలసిన కావలసిన నివేదికలను మంత్రి లోకేష్ కు అందజేసింది. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ ఆలూరు అభివృద్ధికి ప్రత్యేకమైన కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జ్యోతి ప్రభాతవార్తకు చరవాణి ద్వారా తెలియజేసింది. వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో అభివృద్ధి కి



ఇప్పటికే 22 కోట్లు నిధులు కూటమి ప్రభుత్వం హెచ్చించినట్లు తెలిపారు. ప్రతి పని చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో సాధ్యమని నిరూపిస్తామన్నారు. 2029 లో ఆలూరులో టిడిపి జెండా ఎగరవేస్తామని ఆమె జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాలూకా యువ నాయకుడు వైకుంఠం సాయి దినేష్, ఆలూరు పారిశ్రామికవేత్త రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కుచ్చుటోపి పెట్టిన.. బ్యాంకు ఉద్యోగి

: బ్యాంకు తాళం వేసి నిరసన తెలిపిన రైతులు

**నంద్యాల, నవంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి**

బ్యాంకులు అంటే రైతులు. వినయోగదారుల పాలిట ఒక కల్పవృక్షము లాంటివి ఇటీవల కాలంలో చాలా ప్రవేటు బ్యాంకులు వెలశాయి బ్యాంకుల మీద నమ్మకము ఉన్న రైతులు వినియోగదారులు అందులో రుణాలు పొంది నెల నెలా చెల్లించే ఈయంఐలు అందులో పని చేసే వారికి అందించడము పరిపాటి అయింది. ఎవరైన మోసము చేస్తే నివారించాల్సిన బ్యాంకు ఉద్యోగే ఏకంగా రూ 40లక్షలతో ఉడాయించిన వైనము నంద్యాల మహేంద్రా కోటక్ బ్యాంకులో చోటు చేసుకుంది. నంద్యాల పట్టణంలోని ఉన్న మహేంద్ర కోటక్ బ్యాంకులో ఇటీవల కొందరు రైతులు రుణాలు పొందారు. అయితే వాటికి సంబందించిన నెల నెల చెల్లించే ఈయంఐలను అందులో పని చేసే ఉద్యోగి అస్లాంకు చెల్లించేవారమని రైతులు అంటున్నారు. అయితే ఇటీవల బ్యాంకు నుండి ఈయంఐ కట్టలేదని మాకు నోటీసులు అందడము హుటాహుటిన బ్యాంకు చేరుకుని విషయాన్ని వాకబు చేయగా కంతు చెల్లించనందుకే నోటీసలు పంపామని చెప్పడము జరిగిందని వాపోయారు. దీనితో బ్యాంకు సిబ్బందిని లోపలనే పెట్టిన బయట తాళం వేసి నిరసన తెలుపడము జరిగింది. దీనితో బ్యాంకు మేనేజరు ఉదయ్ పోలీసులకు పోన్‌చేయగా వారు వచ్చిన పరిస్తితిచూసి అ ఉద్యోగిని కోఆర్డినేటర్‌ను పిలిపించి మాట్లాడుతామనిచెప్పారు. మేము అ ఉద్యోగికి చెల్లించిన పోన్ పే వివరాలు ఉన్నాయిన చూపించడము జరిగింది. మొత్తం మీద బ్యాంకులో పని చేసే ఉద్యోగే ఏకంగా రైతులకురూ 40లక్షలు కుర్చుటోపి పెట్టడముపై సర్వత్రా బ్యాంకులపై చర్చ నడుస్తోంది.





# అవినీతికి అడ్డాగా.. సబ్ రిజిస్టర్ కార్యాలయం..!

- డాక్యుమెంట్ రైటర్‌తో వెళితే గంటలో పని
- ప్రతి పనికి ఓ రేటు.. తీవ్రంగా చర్చించుకుంటన్న ప్రజలు




సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏ పని కావాలన్న దానికి అధికారులు ఓ రేటు ఫిక్స్‌డ్. అవినీతికి కేరాఫ్ అడ్రస్సుగా ఆలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయమని, పని అంత డాక్యుమెంటరీ చేతిలో ఉంటుంది. అతను చెబితే గంటలో పని అయిపోతుందని పట్టణంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. క్రయ విక్రయ చేసే వారు(రైతులు) రియల్ ఎస్టేట్ వారు నేరుగా సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళితే అనేక కారణాలు చెబుతు కాలయాపన చేసి కార్యాలయ సిబ్బందే ఎవరితో వస్తే పని అయిపోతుందో క్లూయిస్తారు. అతని దగ్గరికి వెళ్ళి అతను ఎంత లంచం నిర్ణయిస్తే అంత చెల్లించి పనులు చేయించుకోవలసిన పరిస్థితి ఆలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నెలకొంది.




**ఆలూరు, నవంబరు 21,ప్రభాతవార్త:** సబ్ రిజిస్టర్‌లో ఎవరికి సంభంధించిన వారి వాల్యువేసన్ సర్టిఫికెట్, ఈసీ నకల్, మ్యారేజ్ సర్టిఫికెట్ లాంటి కావాలంటే చేతులు తడవనిదే ఇవ్వరని, అంతా దళారీల చేతిలో ఉంటుందని సిబ్బంది భాహాటంగా చెప్పడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎక్కడైన అమ్మకాలు, కొనుగోలు రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ చేసుకునే అవకాశం కల్పించింది. కానీ స్తానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలించే నాథుడే లేడు. రిజిస్ట్రేసన్ కావాలంటే డ్యాక్యూమెంటర్ ఆశీర్వాదం ఉండాల్సిందే. రిజిస్టర్ కార్యాలయంలో వచ్చిన వారికి హెల్ప్‌డెస్క్ నిర్వహించాల్సి ఉండగా అవి ఎక్కడ కనపడవు. కంప్యూటర్ ఆపరేటర్ సహాకారంతో సబ్ రిజిస్టర్ నేరుగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతి అక్రమాలకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం కీలక సంస్కరణలు తీసుకు వచ్చిన కొంత మంది అధికారులలో మార్పు రాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర మంతట ఏసిబీ అధికారులు అక్రమార్కుల ఆట కట్టించేందుకు దాడులు నిర్వహిస్తుండడంతో అధికారులు హడలిపోతున్నారు.. అయితే ఆలూరులో మాత్రం ఏసిబీ వచ్చిన ఇంకోకరు వచ్చిన మా తీరు ఇంతే అని సబ్ రిజిస్టర్ సిబ్బంది అంటున్నారు. రాష్ట్ర చివరి బార్డర్‌లో ఈ కార్యాలయం ఉండడంతో ఎవరు పట్టించుకోరు అనే ధీమాతో భారీగా ముడుపులు చెల్లించి ఇక్కడికి పోస్టింగ్ వేయించుకుంటారనే విమర్శలు లేక పోలేదు. ఇప్పటికైన సంభంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్న అవినీతిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు.

## అదుపు తప్పి.. బోల్తాపడిన మినీలారీ

: యువకుడు మృతి- నలుగురికి తీవ్రగాయాలు



**జూపాడుబంగ్లా, నవంబర్ 21, ప్రభాతవార్త :** జూపాడుబంగ్లా మండలం తంగడంచ సమీపంలోని జాతీయ రహదారి 340సి పై శుక్రవారం సాంత్రం మొక్కజొన్నల లోడుతో వెళ్లుతున్న మినీలారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరో నలుగురు హామాలీలు తీవ్రగాయాలకు గురైయారు. వివరాలు ఇలా వున్నాయి. తూడిచెర్ల గ్రామానికి చెందిన మొక్క జొన్నల వ్యాపారి దొంతుల నరసింహులుకు చెందిన మొక్క జొన్నల బస్తాలను నందికొట్కూరులోని రబ్బానికి గోడౌన్‌లో నిల్వ ఉంచేందుకు ఐషర్ వాహనంలో తీసుకెళ్లుతున్నారు. గ్రామానికి చెందిన హామాలీలు బోయ భరత్, యుగంధర్, రహిమాన్ భాష, వెంకటరమణ, శంకర్, శివరామరాజు, పుల్లయ్యలు అదే వాహనంలో వెళ్లుతున్నారు. జాతీయ రహదారిపై మొక్క జొన్నల లోడ్‌తో వేగంగా వెళ్లుతున్న ఐషియర్ వాహనం తంగడంచ గ్రామ సమీపంలోకి రాగనే వేగ నియంత్రణ కోసం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన డ్రమ్ములను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో బోయ భరత్ అక్కడిక్కడే మృతి చెందగా యుగంధర్, రహిమాన్ భాష, వెంకటరమణ, శంకర్‌లు తీవ్రగాయాలకు గురైయారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జాతీయ రహదారికి చెందిన అంబులెన్సులో నందికొట్కూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే మినీ లారీ డ్రైవర్ పారిపోయాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ సంజీవ తెలిపారు.

# ఈనెల 24 నుంచి "మీ కోసం రైతన్న" కార్యక్రమం

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, నవంబరు 21, ప్రభాతవార్త ప్రతినిధిః** రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న మీ కోసం రైతన్న కార్యక్రమాన్ని ఈనెల 24న నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ ఉద్యానశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 24న నుంచి జిల్లా వ్యాప్తంగా మీ కోసం రైతన్న కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులకు నీటి భద్రత, డిమాండ్ అధారిత పంటల సాగు, అగ్రిటెక్‌సాంకేతికతల వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలు ప్రభుత్వం మద్దతు వంటి ఐదు కీలక అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు బృందాలుగ్రామాల్లో రైతులను ప్రత్యక్షంగా సందర్శించి రోజుకు 30 మంది రైతులకు ముఖ్యమంత్రి సందేశ లేఖను చదివి వినిపించడం అయా పథకాలపై కరపత్రాలు అందించడం రైతుల ఫోటోలను అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ సిస్టం యాప్‌లో అప్లోడ్ చేయాలని అధికారులను అదేశించారు. జిల్లాలో ఈసీజన్‌కు మొత్తం 7.56 లక్షల ఎకరాల్లో పంటల నమోదు జరిగిందని కలెక్టర్ తెలిపారు. వరి సాధారణ విస్తీర్ణం 65,255 హెక్టార్లు కాగ, ఈసంవత్సరం 92,313 హెక్టార్‌లలో సాగుజరగగా మొక్క జొన్న సాధారణ విస్తీర్ణం 50,515 హెక్టార్లకు బదులు 96,677 హెక్టార్‌లలో సాగు జరిగిందన్నారు. కందిపంటలో కూడ 36,243 హెక్టార్ల సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 47,035 హెక్టార్‌లలో సాగు జరిగింది. మొత్తం మీద గత సంవత్సరం కంటే 66,472 హెక్టార్ల అదనపు విస్తీర్ణంలో పంటలు సాగుచేయ బడినట్లు వెల్లడించారు. దీంతో ఉత్పత్తి పెరిగి వరి 6 లక్షల మెట్రిక్ టన్నులు, మొక్కజొన్న 6 లక్షల మెట్రిక్ టన్నుల మేర లభించడంతో జిల్లా జీవిఏ కూడ గణనీయంగా పెరిగిందని కలెక్టర్ తెలిపారు.

## నూనెపల్లి అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలి

**– నూనెపల్లె అభివృద్ధి కార్యచరణ కమిటీ మంత్రి ఫరూక్‌కు వినతి**

**నంద్యాల, నవంబరు 21, ప్రభాతవార్త ప్రతినిధిః**



నంద్యాల పట్టణలోని చారిత్రక నూనెపల్లె ప్రాంతంలో అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని నూనెపల్లె అభివృద్ధి కార్యచరణ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. 1898లోనే నంద్యాలతో పాటు మున్సిపాలిటిగా ఏర్పడి ఒకప్పుడు పారిశ్రామిక వ్యాపార కేంద్రంగా కళకళలాడిన నూనెపల్లె ప్రస్తుతం 50 వేల జనాభాతో 9 వార్డులు కలిగి ఉందని నూనెపల్లె ప్రజల దీర్ఘకాలిక కష్టాలను దృష్టిలోవుంచుకొని సమస్యలు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని మంత్రి ఫరూక్‌ను కోరారు. రైల్వే అండర్‌గ్రౌండ్ రహదారి ఏర్పాటు చేయాలి, గతంలో మంత్రిగా హామి ఇచ్చిన విధంగా రైల్వే అండర్‌గ్రౌండ్ రహదారి నిర్మాణాన్ని తక్షణమే యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని రైల్వే ఓవర్‌బ్రిడ్జి కింద సమాంతరంగా ఉన్న అర్ అండ్ బి రోడ్డు గుంతలమయం అయి ప్రమాదాలకు దారితీస్తున్నందున కొత్త సిమెంటు రోడ్డును తక్షణమే వేయాలని కరెంటు అఫీసు వద్ద ఉన్న నంద్యాల–తిమ్మనాయిని పేట ఆర్‌అండ్‌బి రోడ్డులోని చామకాల్వ బ్రిడ్జిని వెడల్పుచేసి ప్రమాదాలు నివారించాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఫరూక్ అధికారులతో మరియు నూనెపల్లె అభివృద్ధి కమిటీతో సమీక్షసమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. త్వరలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. నూనెపల్లె అభివృద్ధి కార్యచరణ కమిటీ కన్వీనర్ శంకరయ్య, తోట రాంభూపాల్, మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, గుద్దేటి వెంకటేశ్వర్లు, జేపి, బ్యాంకు తిమ్మయ్య, ధనుంజయుడు, వెంకటరమణ, షేక్ బషీర్, రామకృష్ణాచారి, రమణయ్య గౌడ్, అధికారులు ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, ఆర్‌అండ్‌బి డీఈఈ పాల్గొన్నారు.

## రాయలసీమ యూనివర్శిటి రిజిస్ట్రార్‌ను తొలగించాలి

**– యూనివర్శిటి అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్నంగా, మోకాళ్ళపై వినూత్న నిరసన**

**కర్నూలు విద్య, నవంబరు 21, ప్రభాతవార్తః**



రాయలసీమ యూనివర్శిటి అనుబంధ బిఈడి కళాశాలల అవినీతి అక్రమాలకు వత్తాసు పలుకుతూ యూనివర్శిటి నిధులను దుర్వినియోగానికి పాల్పడుతున్న యూనివర్శిటి రిజిస్ట్రార్‌ను తొలగించాలని ఏఐఎస్ఏ, రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ శరత్‌కుమార్, ఆర్‌పిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజులు డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్శిటిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్నంగా మోకాళ్ళపై వినూత్న నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్శిటి బిఈడి అనుబంధ కళాశాలలు అవినీతికి అక్రమాలకు కేంద్ర బిందువుగా మారాయని వాటిని అరికట్టడంతో యూనివర్శిటి అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. వర్శిటి రిజిస్ట్రార్ కళాశాలల యాజమాన్యాలకు అడుగులకు మడుగులొత్తుతూ యూనివర్శిటి పరువు ప్రతిష్టలకు భంగం వాటినేల వ్యహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ బిఈడి కళాశాలల యాజమాన్యాలతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని బిఈడి కళాశాలల దందాకు పుష్కలంగా అండదండలు అందిస్తున్నారని ధ్వజమెత్తారు. వీసీ ఉన్నతాధికారులు స్పందించి యూనివర్శిటి రిజిస్ట్రార్‌ను తొలగించాలని లేదా అవినీతి అక్రమాలకు నైతికబాధ్యత వహిస్తు రిజిస్ట్రార్ స్వచ్ఛదంగా రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు కొనసాగిస్తునే ఉంటామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో యూనివర్శిటి నాయకులు అలీ, భూపాల్, బాలాజీ, మునీంద్ర, మధు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పంటపొలాల్లోకి దూసుకెళ్లిన కారు



**మహానంది, నవంబరు 21, ప్రభాతవార్తః** వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి వెళ్లిన సంఘటన మహానంది మండలంలో చోటుచేసుకుంది. కడప జిల్లా మదనపల్లెకు చెందిన కుటుంబ సభ్యులు శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వం స్వామి వాఆరి దర్శనార్థమై శుక్రవారం మహానందికి వచ్చారు. దర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో వెళ్తుండగా గాజులపల్లె రైల్వేస్టేషన్‌సమీపంలో వినబగ్గిరోడ్డు మలుపువద్ద అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో ఏవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో కారును బయటకు తీయించి క్షేమంగా ఇంటికి వెళ్లాలని సూచించారు.

## పారిశుద్ధ్య కార్మికుల శ్రమతోనే గ్రామాల స్వచ్ఛత

**– ఎంపీడివో భాగ్యలక్ష్మీ**



**రుద్రవరం, నవంబరు 21, ప్రభాతవార్తః** పారిశుద్ధ్య కార్మికుల శ్రమతోనే గ్రామాలు స్వచ్ఛతగా ఉన్నాయని ఎంపీడిఓ భాగ్యలక్ష్మీ అన్నారు. మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో శుక్రవారం మండలంలోని పారిశుద్ధ్య కార్మికులకు స్వచ్ఛతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నంద్యాల సుబ్బమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ గ్రామపంచాయితీ కార్యదర్శి పాములేటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడివో భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం మేరకు పారిశుద్ధ్య కార్మికులు గ్రామాలను స్వచ్ఛతగా ఉండేలా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా గ్రామాలు స్వచ్ఛతగా ఉంటాయని ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. గ్రామాల్లో పారిశ్ధ్య కార్మికులు పారిశుద్ధ్యంపై చేస్తున్న శ్రమ ఎనలేనిదని వారిని కొనియాడారు. చెత్త సేకరణ సమయంలో చెత్తను కాల్చరాదని తడి పొడి చెత్తను, ప్లాస్టిక్‌ను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని తద్వారా ప్రభుత్వానికి ఆదాయవనరులు సమకూర్చేలా తడి పొడి చెత్తను ఉపయోగించడం జరుగుతుందని పారిశుద్ధ్య కార్మికులకు ఆమె సూచించారు. ఇంకా పలు అంశాలపై పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఈశిక్షణ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, అయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కేజీబీవీ ప్రిన్సిపాల్ రుక్సానను కొనసాగించాలి..!



**పెద్దకడబూరు, నవంబర్ 21, ప్రభాతవార్త :** పెద్దకడబూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ రుక్సానను కొనసాగించాలని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నా ప్రిన్సిపల్ జ్యోతిని సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం పాఠశాల ముందు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు ఖాజా శేఖర్ ఉదయ్ కృష్ణ మాట్లాడుతూ గతంలో మద్దికేర కేజీబీవీ ప్రిన్సిపల్ గా జ్యోతి విధులు నిర్వహిస్తూ అక్కడ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య భోజనం ,అందించక విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించకుండా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్సిపల్ జ్యోతి ని సస్పెండ్ చేయకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు డిఇఓ, జిసిడిఓ తిరిగి పెద్దకడబూరు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు వాస్తవాలు తెలుసుకొని గతంలో ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపల్ రుక్సాన ను కొనసాగించి విద్యార్థుల చదువులను కాపాడాలని వారు డిమాండ్ చేశారు, లేనిపక్షంలో విద్యార్థి సంఘాలుగా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఆనంద్, అశోక్, కిట్టు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకందారుల సంఘం కో-ఆప్షన్ డైరెక్టర్‌గా యల్లరాజుయాదవ్ ఎన్నిక



**వెల్దుర్తి, నవంబర్ 21, ప్రభాతవార్త :** గొర్రెల,మేకల పెంపకందారుల సంఘం కో-ఆప్షన్ డైరెక్టర్‌గా వెల్దుర్తి మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన యల్లరాజుయాదవ్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూలు జిల్లా ఛైర్మెన్ కెఏ శ్రీనివాసులు, రాష్ట్ర బిసి సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరయాదవ్, జిల్లా వైస్ ఛైర్మెన్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో కర్నూలులో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కో-ఆప్షన్ డైరెక్టర్‌గా ఎన్నికైన నర్సాపురం యల్లరాజుయాదవ్‌కు వెల్దుర్తి బ్రహ్మగుండేశ్వర గొర్రెల, మేకల సొసైటీ అధ్యక్షులు కురువ రాజశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు.

## విఓఏలకు పొదుపు బుక్కుల నిర్వహణపై శిక్షణ



**పాములపాడు, నవంబరు 21, ప్రభాతవార్తః** పాములపాడు మండలంలోని వివిధ గ్రామాల విఓఏలకు గ్రామాల్లోని పొదుపు సంఘాల రికార్డుల నిర్వహణపై ఏపీఎం ఉమా మహేశ్వరీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లీగల్ కో ఆర్డినేటర్ పుల్లయ్య విఓఏలకు శిక్షణ ఇచ్చారు. పొదుపు మహిళల బుక్కులను ఏవిధంగా రాయాలో అనే అంశంపై బ్యాంకు లింకేజి లోన్లు, ఉన్నతి లోన్లు, స్త్రీనిధి లోన్లు మహిళలు తీసుకునే సమయంలో వారందరికి తెలియపరచాల్సిన విషయాలపై రికార్డుల్లో తీర్మాణాలు చేయాల్సిన అంశంపై శిక్షణ ఇచ్చారు. రుణాలు తీసుకున్న మహిళలు స్వయం ఉపాధిపై వారి కుటుంబం అభివృద్ధి చెందేవిధంగా విఓఏలు కల్పించాల్సి ఉందన్నారు. ప్రతివిషయం పొదుపు మహిళలకు తెలియజేసి వారి సమక్షంలోనే రికార్డులు రాయాల్సి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ మధు, వెలుగు సీసీలు గాంధీ, వెంకటరాముడు, నాగన్న, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన ముచ్చుమర్రి ఎస్ఐ నాగేంద్ర



**పగిడ్యాల, నవంబరు 21, ప్రభాతవార్త :** పగిడ్యాల మండలం లక్ష్మాపురం అంచవద్ద శుక్రవారం సాయంత్రం ముచ్చుమర్రి ఎస్ఐ నాగేంద్ర వాహనాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఆటోలను, ద్విచక్రవాహనాలను మొదలగు వాహనాలను తనిఖీ చేశారు. ఆటోలలో పరిమితిమించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో డ్రైవర్లను మందలించారు. పరిమితి మించిన ప్రయాణికులను తరలిస్తున్న నేపథ్యంలో జరగరాని సంఘటన జరిగితే ఎవరు బాధ్యులనీ మండి పడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహించే తీవ్ర పరిణామాలుంటాయనీ హెచ్చరించారు. ద్విచక్రవాహనం దారులు వాహనానికి సంబంధించిన దృవపత్రాలు తప్పనిసరిగా వెంటవుంచుకోవాలనీ, ముందు జాగ్రత్తగా హెల్మెట్ తప్పకుండా వినియోగించుకోవాలనీ సూచించారు. 15 మంది జరిమానా విధించి నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ఈ తనిఖీలో ఎస్ఐ వెంట ఎఎస్ఐ శేషమ్మ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఆరాటం



**నందికొట్కూరు, నవంబరు 21, ప్రభాతవార్త:** ప్రజలకు సేవ చేసే అవకాశం దేవుడు తనకు ఇచ్చినందుకు కృతజ్ఞతగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆరాటపడుతు అధికారులను పరుగులు పెట్టిస్తూ శ్రమిస్తు ప్రజల అభిమానం చూరగొంటున్న నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో నియోజకవర్గం అభివృద్ధి కోసం మరియు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫైళ్ళను తీసుకొని సంభంధిత అధికారుల వద్దకు వెళ్ళి కలిసి సమస్యలను వివరించి నిధులు తెచ్చుకునేందుకు ఆయన పడుతున్న శ్రమను పలువురు అభినందిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం ప్రజల నుండి వినతులు స్వీకరించడం, ఎంతో మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అంధించడంలో ఆయన చూపుతున్న చొరవకు లబ్ధిదారులు హార్షం వ్యక్తం చేస్తున్నారు, సంక్షోభంలో సేవ..ప్రజల కోసం శ్రమ ఇదే నా ఆశయం అన్నట్లు ఎమ్మెల్యే వెళుతున్నట్లు ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

**– మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి**



**మంత్రాలయం, నవంబరు21, ప్రభాతవార్త;** నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మాధవరంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీల రూపంలో వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నిరభ్యంతరంగా తెలియజేయాలన్నారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ



**ఆళ్లగడ్డ, నవంబరు 21, ప్రభాతవార్తః** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌ఉరెడ్డిలు శుక్రవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఆళ్లగడ్డలోని శిల్పాలను ప్రమోట్ చేసేందుకు ప్రణాళికలు చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి కాంపౌండ్ వాల్స్, అలాగే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్నివిధాల విద్యార్థులకు సౌకర్యాలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు రిప్రజెంటేషన్ అందించారు. ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామి ఇచ్చినట్లు ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ తెలిపారు.

## కొలిమిగుండ్లలో స్వచ్ఛభారత్

**కొలిమిగుండ్ల, నవంబరు 21. ప్రభాతవార్తః**



కొలిమిగుండ్ల మడల కేంద్రం లోని ఎంపీడిఓ దస్తగిరి బాబు, డిప్యూటి ఎంపీడివో చంద్ర మౌలీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఎస్‌డిజి శిక్షణలో భాగంగా శుక్రవారం ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఆగ్రామంలో ఉన్నటువంటి పేరుకుపోయిన చెత్తను, మట్టిని తొలగించి గ్రామాన్ని శుభ్రపరిచి పరిశుభ్రంగా ఉంచాలని అదేశించడంతో కొలిమిగుండ్ల గ్రామాన్ని ఎంపిక చేసుకొని మండలంలో ఉన్నటువంటి గ్రీన్ అంబాసిడర్లను పిలిపించడం జరిగింది. తదుపరి వారిని టీమ్‌లుగా ఏర్పరచి ఎస్సీకాలనీలో పెరుకుపోయిన చెత్తను చెత్త తోలగించడం, కొద్దిరోజుల్లో గాజాలను ఏర్పాటు చేసి తడిచెత్త పొడిచెత్తను ఇష్టం వచ్చినట్లు రోడ్ల వెంట వేయకుండా చుట్టుపక్కల వున్నవారికి తెలియజేయడం జరిగింది. అలాగే లక్ష్మీనరసింహస్వామికి పోయే దారిలో కుడివైపు, యడమవైపు వున్న చెత్తను కూడ హరిత రాయబారుల నుంచి శుభ్రం చేయడం జరిగింది. అనంతరం మార్కెట్‌లో ఉన్నటుంటి గార్బేజిని కూడ పూర్తిగా తొలగించడం జరిగింది. తదుపరి గ్రీన్ అంబాసిడర్లు మండల పరిషత్ కార్యాలయంలో భోజనం తరువాత వారిని సమావేశపరిచి వారి సమస్యలు ఏమైనా ఉన్నచో విన్నవించమని కోరగా చాల మంది వారి సమస్యలు చెప్పి ఆ సమస్యలన్ని ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తామని ఈసందర్భంగా ఎంపీడిఓ వారికి తెలిపారు. వారి వారిసేవలను కొనియాడుచూ శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## దూది రైతుకు.. దుఃఖమే..!

**(మొదటి పేజీ తరువాయి ) :** నమ్ముకొని పత్తిని సాగు చేసి చేతికొచ్చిన పంటను జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలసిన పత్తి దుకాణాలకు తెస్తే దళారులు రైతుల కంట్లో మట్టి కొట్టి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి వ్యాపారులతో కుమ్మకై దండుకుంటున్నారు. పత్తి వ్యాపారంలో మధ్య దళారులు జోక్యం చేసుకొని రైతుకు మద్దతు ధర దక్కకుండా దోచుకుంటున్నారు దళారులు. జిల్లాలో దాదాపు లక్షల ఏకరాల్లో పత్తి పంటను సాగు చేశారు రైతులు. ఏటా ప్రకృతి వైపరీత్యాల కారణాల వల్ల రైతు పంట దిగుబడి రాక నష్టపోతూనే ఉన్నారు. అయితే ఈసారి సకాలంలో వర్షాలు కురిసి పచ్చని పైర్లతో కళకలలాడుతున్నాయి. రైతులు కూడ పంట దిగుబడి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడ పత్తి పంటకు మద్దతు ధర కూడ ప్రకటించింది. దీంతో రైతన్న సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి. పంట దిగుబడిని రైతులు మార్కెట్ యార్డుకు తరలించి పత్తిని విక్రయించి మంచి లాభాలను ఆర్జించారు. అయితే కొంతమంది దళారులు చేతుల్లో మోసపోయిన రైతులు కూడ ఉన్నారు. దళారులు నేరుగా గ్రామాలకు వెళ్లి ఆధిక ధరకు పత్తి కోనుగోలు చేస్తామని మాయ మాటలు నమ్మి ఇళ్ల దగ్గరే దళారులకు పత్తిని విక్రయించారు. దళారులు మాత్రం రైతులకు తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్ యార్డులో ఆధిక ధరలకు పత్తి విక్రయాలు చేసి లాభాన్ని డేగల్లా తన్నుకుపోతున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో పత్తి వ్యాపార దుకాణాలు ఏలాంటి అనుమతులు లేకుండా విచ్చల విడిగా పత్తి వ్యాపారం చేస్తున్నారు. పత్తి వ్యాపారులు ఒక్కొ దుకాణానికి ఒక్కొ దళారిని ఏర్పాటు చేసుకొని గ్రామాల్లో రైతుల దగ్గరకు వెళ్లి ధర ఎక్కువ ఇస్తామని మాయ మాటలు చెప్పి పత్తిని తమ దుకాణాల వైపు తరలిస్తున్నట్లు సమాచారం. దుకాణానికి తీసుకువచ్చిన పత్తిని తూకాల్లో మోసాలకు పాల్పడుతూ తక్కువ క్వింటాలు చూపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా దళారులు ధర ఎక్కువ ఇప్పిస్తామని చెప్పి ఇక్కడ కనీస మద్దతు ధర కూడ ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇలా రైతులను నిలువునా దోపిడి గురిచేస్తున్నారు పత్తి వ్యాపారులు. అంతేకాకుండా రోజుకు లక్షల్లో వ్యాపారం చేస్తూ ఆదాయ పన్ను శాఖకు ఏలాంటి ఆదాయం చెల్లించకుండా జీరోగా వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. రాత్రికి రాత్రే లారీలు పత్తిని దూర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రైతులకు చిత్తు కాగితాల్లో బిల్లులు వేస్తూ పంట విక్రయించిన సొమ్మును ఇచ్చేందుకు నెలలు తరబడి తమ దుకాణాల చుట్టూ తిప్పుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టా రాజ్యంగా ఏర్పాటు చేసుకొని రైతులను నిలువునా దోపిడీ చేస్తున్న దళారులపై తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యాపార దుకాణాలపై వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు చర్యలు తీసుకొవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేసుకున్న పత్తి దుకాణాలపై పూర్తి స్థాయిలో పరిశీలించి అనుమతి లేని దుకాణాలను సీజ్ చేయాలని రైతులు కోరుతున్నారు. **విక్రయాల్లో జాప్యం..!** సీసీఐ అందుబాటులోకి తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు ముందుగా స్లాట్ బుకింగ్ చేయకపోతే పంటను విక్రయించుకునే అవకాశం లేదు. పట్టా పాసుపుస్తకంతో పాటు సర్వే నెంబర్ మండలం, గ్రామం, అధికారుల నుంచి పంట ధ్రువీకరణ పత్రంతోపాటు పత్తిని ఎప్పుడు విక్రయించదలుచుకున్నారో తేదీ, పంట బరువు, సమయం... ఏ మార్కెట్ యార్డులో అమ్ముతారో అన్న విషయాలను స్లాట్ బుకింగ్లో పొందుపర్చాల్సి ఉంటుంది. యాప్లో నమోదు చేసిన వివరాల ఆధారంగా, పత్తి పంటను సీసీఐ కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేస్తారు. మార్కెటింగ్ శాఖాధికారులు, వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉండగా ఇవేమి పట్టించుకోకపోవడంతో రైతులకు పంట విక్రయాల్లో జాప్యం ఏర్పడుతుంది. ఇక మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల రైతులు స్మార్ట్ ఫోన్లు లేక, నెట్వర్క్ సరిగా అందక అక్షరాస్యత లేక అవస్థలు పడుతున్నారు. దీంతో దళారులు పత్తి రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు మరియు నిబంధనలు..! కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ ) కొనుగోలుకు కొన్ని కఠినమైన నిబంధనలు ఉన్నాయి. తేమ శాతం..! పత్తిలో తేమ శాతం 8 నుండి 12 మధ్య మాత్రమే ఉండాలి. 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయడానికి సీసీఐ అనుమతించదు.కానీ ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తారు. 8శాతం కంటే తక్కువ తేమ ఉంటే ప్రోత్సాహకాలు అందించబడతాయి. కొనుగోలు పరిమితి..! కొన్ని ప్రాంతాలలో, ఒక రైతు నుండి ఎకరానికి ఏడు క్వింటాళ్ల కంటే ఎక్కువ పత్తిని కొనుగోలు చేయకూడదని సీసీఐ నిబంధనలు విధించింది, అయితే ఈ పరిమితిని 12 క్వింటాళ్లకు పెంచాలని విజ్ఞప్తులు ఉన్నాయి. నాణ్యత..! రైతులు తమ పంట తేమ శాతం, ఫైబర్ పొడవు, బలం మరియు విత్తన నాణ్యతతో సహా అన్ని ఎఫ్ఏక్యూవ్ పారామితులను పాటించినట్లయితేనే ఏంఎస్పీ ప్రయోజనాలను పొందగలరు. కనీస మద్దతు ధర (ఏంఎస్పీ)202526 సీజన్‌కు భారత ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధరను పెంచింది. మీడియం స్టేపుల్ పత్తి.. క్వింటాలుకు రూ. 7,710. లాంగ్ స్టేపుల్ పత్తి.. క్వింటాలుకు రూ. 8,110. ఈ ధరలు మార్కెట్ ధర కంటే తక్కువగా ఉన్నప్పుడు రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తారు. తద్వారా దళారుల దోపిడీని నివారించవచ్చు అని తెలుపుతున్నారు.

## కేంద్ర పథకాలతో జిల్లా అభివృద్ధి వేగవంతం

**(మొదటి పేజీ తరువాయి ) :** దృష్టి సారించిన ఎంపీ, ప్రత్యేక నిధులతో సమస్యను పరిష్కరించాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కర్నూలు–బళ్లారి స్టేట్ హైవేను నేషనల్ హైవేగా మారుస్తామని తెలిపారు. నగరంలో క్రికెట్ స్టేడియం డిజైన్, అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ నేషనల్ లైవ్ మిషన్ పై గ్రామ స్థాయిలో అవగాహన అవసరమని చెప్పారు. నీటి సమస్యలకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ కేంద్ర పథకాల అమలుకు సంబంధించిన ప్రతిపాదనలు ఎంపీ సూచనల ప్రకారం రూపొందిస్తామని తెలిపారు. వ్యవసాయంలో సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా సాగు విధానాలు అమలు చేయాలని సూచించారు. పంట మోడల్ వైవిధ్యంతో పాటు ప్రకృతి వ్యవసాయం, రైతు సంఘాల ఏర్పాటుపై ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పాఠశాలల టాయిలెట్ మరమ్మతులకు రూ. 17 కోట్లు ప్రతిపాదించామని, వసతి గృహాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నింపేందుకు ఇరిగేషన్ శాఖకు నిర్దేశాలు జారీ చేశామని తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారులు, దిశా కమిటీ సభ్యులు మరియు వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

## కోతులదాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు



**రుద్రవరం, నవంబరు 21, ప్రభాతవార్తః** మండల పరిధిలోని నల్లవాగు పల్లెగ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ అనే వృద్ధురాలిపై కోతులు దాడిచేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు వెంకటసుబ్బమ్మ తన ఇంటి వద్ద పనులు చేసుకుంటుండగా కోతులు అకస్మాత్తుగా ఆమెపై దాడిచేసి తలకు తీవ్రంగా గాయపరిచాయన్నారు. వెంటనే గ్రామస్థులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. కోతుల దాడిపై గ్రామ పంచాయితీ అధికారుల స్పందించి కోతుల బెడదను అరికట్టాలని కోరుతున్నామన్నారు.

## సర్వే అకాడమీ సామర్లకోట నుంచి డిప్యూటీ డైరెక్టర్ జి.పి.రామకృష్ణ



**మంత్రాలయం, నవంబరు 21, ప్రభాతవార్త;** మంత్రాలయం మండలకేంద్రంలోని బుదూరు మరియు దిబ్బనదొడ్డి రీ సర్వే పనుల గురించి ఇన్‌స్పెక్షన్ సందర్భంగా మంత్రాలయం మండలంలో డివిజనల్ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉరుకుంద ఆచారి, విలేజ్ సర్వేయర్ తిమ్మేష్‌లు వచ్చారు. వారికి శాలువా వేసి మెమోంటో ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. వీరి వెంట డివిజనల్ డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాసరాజు, కర్నూలు టాస్క్ ఫోర్స్ డివిజనల్ డిప్యూటీ సర్వేయర్ విజయ కుమారి, మండల సర్వేయర్ అశోక్ పాల్గొన్నారు.

## నేల ఆరోగ్యంపై విద్యార్థినీలకు అవగాహన



**వెల్దుర్తి, నవంబర్ 21, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణ సమీపంలోని డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ గురుకులం పాఠశాలలో ఏఓ అక్బర్‌బాష అధ్యక్షతన ఆత్మ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి నేల ఆరోగ్యంపై విద్యార్థినీలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) కర్నూలు జిల్లా వ్యవసాయశాఖ ఈ అవగాహన కార్యక్రమం చేపట్టిందన్నారు. భూసారపరీక్షలు చేయించి భూమిలోని లోపాలను తెలుసుకొని తద్వారా భూమికి అవసరమైన పోషకాలను ఇచ్చి పంటలను సాగుచేసి మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. విచక్షణారహితంగా ఎరువులు, పురుగుల మందులు వాడరాదని విద్యార్థులకు తెలియజేశారు. భావితరాల కు మంచి ఆరోగ్యమైన నేలను అందించాలంటే విచక్షణారహితంగా రసాయానిక ఎరువులు, పురుగుల మందులు చాలావరకు తగ్గించాలని కోరారు. ప్రతి పంటలో కంది, పెసర, మినుములు అంతర పంటలుగా సాగుచేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు భూసారపరీక్ష కేంద్రం వ్యవసాయాధికారులు శ్రీమతి హరిప్రియ, శ్రీమతి మంజుల, వెల్దుర్తి ఏఓ అక్బర్‌బాష, ప్రిన్సిపాల్ శ్రీమతి లక్ష్మీప్రసూన, అధ్యాపకులు హరిత, రాజమ్మ ఆత్మ బిటిఎం యశ్వంత్, ఏఇఓ అజయ్ రైతు సేవా కేంద్రం సిబ్బంది లింగన్న, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## 24న పగిడ్యాల ఎంఈఓ కార్యాలయంలో ఎంఐఎస్ నిరసన

**పగిడ్యాల, నవంబరు 21, ప్రభాతవార్త :** రాష్ట్రకమిటీ పిలుపు మేరకు స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, సీఆర్‌పిలు డేటా అపరేటర్స్,మెసింజర్ 24వ తేదీన నిరసన కార్యక్రమం చేపట్టినట్లు ఎంఐఎస్ కో-ఆర్డిడనేటర్ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంకోసం నిరసన కార్యక్రమం చేడుతున్నామన్నారు. హెచ్ఆర్‌పి పాలసీ, ఎంటీఎస్ అమలుచేయాలనీ కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ముందుగా శుక్రవారం మండల విద్యాశాఖాధికారులు –1 పి.సుభాన్, –2 యర్రం మురళీమోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేట్, సీఆర్‌పీలు, డేటా అపరేటర్, మెసింజర్ పాల్గొన్నారు.

# అర్హులైన దివ్యాంగ విద్యార్థి క్యాంపుకు హాజరుకావలి

– జిల్లా విలీన విద్యా సమన్వయకర్త



**వెలుగోడు, నవంబరు 21, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం అరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాల గల పిల్లల ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరానికి అర్హులైన 1వ తరగతి నుండి ఇంటర్ వరకు చదువుచున్న విద్యార్థులు హాజరైనట్లు చూసుకోవాలని జిల్లా విలీన విద్యా సమన్వయకర్త జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వెలుగోడు పట్టణంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవిత యందు నిర్వహిస్తున్న రికార్డులను, క్యాంపుకు వచ్చే విద్యార్థుల దం ఖాస్తున్న పరిశీలించారు. అయన మాట్లాడుతూ ఈ క్యాంపులు 24వతేది అత్మకూరు, 25వతేది నందికొట్కూరు, 26వతేది డోన్, 27వతేది బనగానపల్లి, 28వతేది అళ్లగడ్డ, 29వతేది నంద్యాల నియోజకవర్గాలలో అలింకో సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. ఇప్పటికే అయా మండలాల ఐఈఅర్టీల ద్వారా మండల స్థాయి అధికారులకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు,ఐసీడీఎస్ సూపర్ వైజర్లకులకు కరపత్రాల ద్వారా, సోషల్, వార్తా పత్రికల ద్వారా తెలియ జేయడం జరిగిందన్నారు. క్యాంపుకు వచ్చే విద్యార్థులు అడిఫ్ ఫాం,సదరం జిరాక్స్, రేషన్ కార్డు, అధాయ ధృవీకరణ పత్రం, అధార్ కార్డు జిరాక్స్,మూడు పాస్‌పోర్టుసైజు ఫోటోలు మరియు యుడీఐడీ కార్డు అన్ని జిరాక్స్ చేయించుకొని రావాలన్నారు. దివ్యాంగ పిల్లవారిని ఒక పేరెంట్‌కు రవాణ భత్యంతో పాటు భోజన సౌకర్యం కూడా కల్పించడం జరిగిందన్నారు. క్యాంపుకు వచ్చి పిల్లవానికి అలింకో డాక్టరు పరీక్షించి వారికి కావాల్సిన ఉపకరణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అత్మకూరు, నందికొట్కూరు క్యాంపు నిర్వహించే ప్రాంతాలను పరిశీలించడం జరిగిందని దివ్యాంగ పిల్లలు ఇబ్బంది పడకుండా అన్న సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంఈఓ బ్రహ్మం నాయక్, అలెస్కో కో అర్డినేటర్ ప్రసన్న కుమార్, విలీన విద్యా సహాయ సమన్వయకర్త శ్రీనివాసులు, ఐఈఅర్టీలు పీవీఎస్ రావు, ఖుద్రతుల్లా, ష ంషుద్దీన్ పాల్గొన్నారు.

## తడిచెత్త నుండి సేంద్రియ ఎరువు తయారు

– ఎంపిడిఓ సుమిత్రమ్మ



**పగిడ్యాల, నవంబరు 21, ప్రభాతవార్త :** తడిచెత్తనుండి సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని ఎంపిడిఓ సుమిత్రమ్మ అన్నారు. మండలంలోని నెహ్రూనగర్‌లో శుక్రవారం గ్రీన్ అంబాజిడర్స్‌కు శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రీన్ అంబాజిడర్స్ ఇంటింటికి వెళ్లి తడిచెత్త – పొడిచెత్తను సేకరించిన అనంతరం చెత్త షెడ్డుకు తీసుకొని రావాలన్నారు. తడిచెత్తను పొడిచెత్తను వేరుచేయాలన్నారు. తడిచెత్తనుండి సేంద్రీయ ఎరువు తయారు చేయానీ అన్నారు. ఎలా తయారు చేయాలనో వివరంగా ఎంపిడిఓ సుమిత్రమ్మ సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూరాకుల రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, గ్రీన్ అంబాజిడర్స్,తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియాలజీ ప్రాధాన్యంపై అవగాహన



**కర్నూల్ హాస్పిటల్, నవంబర్ 21, ప్రభాతవార్త :** ఫిజియాలజీపై పట్టు సాధిస్తే వైద్య విద్యలో అన్ని విభాగాల్లో రాణించవచ్చని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కె.ఎం.సి ప్రిన్సిపల్ డాక్టర్ కే. చిట్టి నరసమ్మ తెలిపారు. ఫిజియాలజీ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శరీర నిర్మాణం, పనితీరుపై అవగాహన ప్రతి వైద్య విద్యార్థికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఆదిమూలపు సురేష్, అంతర్గత–బాహ్య ఆరోగ్య పరిస్థితులు సమతుల్యం అయితేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వ్యాఖ్యానించారు. ఫిజియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సుధారాణి పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కె.ఎం.సి ఫౌండర్ డాక్టర్ వెంకటరామయ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, పీజీలు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

– ఎంఈఓలు సుధారాణి, కబీర్‌సాబ్



**హొళగుంద, నవంబరు 21, ప్రభాతవార్త ;** విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఎంఈఓ-1 సుధారాణి, ఎంఈఓ-2 కబీర్‌సాబ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని మార్లమడికి గ్రామంలో ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం ప్రసాద్ సహకారంతో గ్రామంలో పాఠశాలకు భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్రశిక్షా అభియాన్ ద్వారా రూ.14.65 లక్షలతో నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. టీడీపీ యువ నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ తమ గ్రామంలోని పాఠశాలకు అదనపు గది నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందిస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ తనయుడు రమేష్, హెచ్ఎం పరమేష్, టీడీపీ కార్యకర్తలు రామంజిని, నల్లారెడ్డి, ఉమేష్, రంగప్ప, లంకెప్ప, గోవిందు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**చిప్పగిరి, నవంబర్ 21, ప్రభాతవార్త :** అంటువ్యాధులు రాకుండా గ్రామంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని క్లీన్ అండ్ గ్రీన్ ప్రత్యేక అధికారి అమర్నాథ్, ఎంపీడీవో అల్లా బకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిప్పగిరిలో డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు ఆధ్వర్యంలో, పంచాయతీ కార్యదర్శి ప్రమీల అధ్యక్షతన పారిశుద్ధ కార్మికులతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చిప్పగిరిలో నిర్వహించారు. మండలంలోని పారిశుద్ధ కార్మికులందరినీ చిప్పగిరికి పిలిపించి చెత్తాచెదారం తదితర అపరిశుభ్రత ప్రాంతాలను క్లీన్ చేయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు స్పెషల్ అధికారి అమర్నాథ్ విలేకరులకు తెలియజేశారు. మండల పరిపాలన అధికారి శ్రీనివాసులు,కార్యదర్శులు బాలన్న,సిసింద్రీ, సురేంద్ర, సుధీర్, జయరాం నాయక్, నరేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీలను వంద శాతం క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలి



**హాలహర్వి, నవంబరు 21, ప్రభాతవార్త;** గ్రామాల్లో క్రమం తప్పకుండా ఇంటింటి చెత్త సేకరణ, పారిశుద్ధ్యం పనులు, మొక్కలు పెంపకం చేపట్టి గ్రామ పంచాయతీలను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ వరలక్ష్మీ పిలుపునిచ్చారు. శుక్రవారం హాలహర్విలో పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి, పరిశుభ్రత కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం, విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. మండలంలోని ఒక గ్రామ పంచాయతీని మోడల్‌గా ఎంపిక చేసుకుని ఆ పంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికను పగడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పరిశుభ్రతను వందశాతం సాధించి ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. పారిశుధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, మొక్కలు పెంపకంపై మంచి ఫలితాలు రావడానికి అనుసరించాల్సిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యం



**పాములపాడు, నవంబరు 21, ప్రభాతవార్త:** గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో స్వచ్ఛగ్రామాలు సాధ్యమని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల పారిశుద్ధ్య కార్మికులకు పచ్చదనం పరిశుభ్రతపై ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ పలు అంశాలపై కార్మికులకు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో చెత్తను సేకరించి చెత్తను నుండి సంపదను తయారుచేయు కేంద్రానికి తీసుకెళ్లి వాటిని పొడి, తడి చెత్తను వేర్వేరుగా చేసి వర్మికంపోస్టు ఎరువులను తయారుచేయడంలో స్వచ్ఛ కార్మికులు కీలకపాత్ర పోసిస్తున్నారన్నారు. గ్రామాల్లో మరింత పరిశుభ్రత ఉండేవిధంగా కార్మికులు చెత్త లేకుండా ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం రుద్రవరం గ్రామంలో కార్మికులంతా కలిసి గ్రామాన్ని పరిశుభ్రపరిచారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో సులోచన, సర్పంచ్ రామస్వామి పాల్గొన్నారు.

## చెత్తసేకరణను పరిశీలించిన మండల అధికారులు



**వెల్దుర్తి, నవంబర్ 21, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని పలు వీధుల్లో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం కార క్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లు చెత్తసేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఓ సుహాసినమ్మ,డిప్యూటీ ఎంపిడిఓ రవికిశోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు గ్రీన్‌అంబాసిడర్లకు అవగాహన కల్పించారు.ప్రతి ఇంటి నుంచి తడిచెత్తను,పొడిచెత్తను వేరువేరుగా సేకరించాలన్నారు. సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తరలించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపి.దేవమ్మ, రాధిక పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయం



**పత్తికొండ, నవంబరు 21, ప్రభాతవార్త :** ఇటీవల రాయలసీమ యూనివర్శిటీ (ఐసిటి)ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్‌లో వాలీబాల్ గేమ్ లో పత్తికొండ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫైనల్‌లో ఎస్.టి.జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో పోటీపడి ప్రథమ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.మాధూరి తెలిపారు. మంచి ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను అభినంధించారు. పవన్‌కుమార్, హానుమంతురెడ్డి,ఫిజికల్ డైరెక్టర్ టి.ఎస్.హుస్సేన్ మరియు అధ్యాపకులు అభినంధించారు.

## మిడుతూరులో చెత్తకుప్పలు తొలగింపు



**మిడుతూరు, నవంబరు 21, ప్రభాతవార్త :** మండలంలో ఏదైన ఒక గ్రామాన్ని ఎన్నుకొని గ్రామ పంచాయితీలో అందరు హారిత రాయబారుల చేత ఎండ్రిన చెత్త కుప్పలు ఉంటే తొలగించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన మిడుతూరులో దాదాపు చోట్ల ఉన్న చెత్త కుప్పలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.అలాగే ఎస్థభ్యూఎం షెడ్డులను కూడా శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్, శ్రీనువాసులు, ఎంపిడివో దశరథరామయ్య, మండల విస్తరణాధికారి సంజన్న, పంచాయితీ కార్యదర్శిలు, టిడిపి మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొనా న్నరు.

## ఘనంగా కార్తీక మాసం ముగింపు కార్యక్రమాలు



**ఆలూరు, నవంబరు 21, ప్రభాతవార్త :** గత నెల రోజుల నుండి తెల్లవారు జామున మూడు గంటల నుండి పట్టణంలోని కోటవీధిలో వెలసిన శ్రీభీమలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం పూజలు నిర్వహించారు. శుక్రవారం పాడ్యమితో ముగింపు సంధర్భంగా అత్యంత భక్తి శ్రద్దలతో పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, రేద్రాభిషేకం, నవగ్రహాల పూజ బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో మహిళలు కుటంబ సభ్యులతో కలిసి ఆలయంలో దీపారాధన చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు యుగేంధర్‌స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు.

## మెడికల్ విద్య ప్రైవేటీకరణను ఆపాలి



**నందికొట్కూరు, నవంబరు 21, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని వెంటనే ఆపాలని పిడిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహాసిల్దార్ బి.శ్రీనువాసులు కు వినతి పత్రం అందజేశారు. పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి కె.ఆది మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నప్పటి నుండి మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి కృషి చేస్తున్నదని, ఇది పూర్తిగా కార్పోరేటీకరణ దిశగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. దేశ వ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం ఏదైతే విద్యా వ్యవస్థను ప్రైవేశ పెడుతుందో అదే విధానాన్ని ఏపిలో రుద్దుతున్నారని అందులో భాగంగానే మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ అని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హాయాంలో 17 కాలేజీలు మంజూరు అయ్యాయని అందులో ఏడు కాలేజీలు పూర్తి అయ్యాయని మిగిలిన 10 కాలేజీలు నామమాత్రంగా పూర్తికాని దశలో ఉన్నాయని ఆయన తెలిపారు. 10 మెడికల్ కాలేజీలను నిర్వహించలేమని సి.ఎం.చంద్రబాబునాయుడు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాడం దారుణమని, గత ప్రభుత్వ హాయాంలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో జీఓ నెం. 107,108 తీసుకువస్తే ఆ జీవోలను రద్దు చేసి మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలని ఇప్పుడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పెద్ద ఎత్తున ఆంధోళన చేశారని, వారి ప్రభుత్వం వస్తే ప్రైవేటీకరణ పట్ల ప్రేమ చూపుతున్నారని ఆయన విమర్శించారు. డివిజన్ నాయకులు జగదీష్,శ్యాంనాయక్, అజయ్, అంజి, రాజు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్లో కోటి సంతకాల సేకరణ



**ఆదోని, నవంబర్ 21, ప్రభాతవార్త :** వైఎస్ఆర్సిపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు వైయస్ఆర్సీపీ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి గఆదేశాల మేరకు ఎంఎం రోడ్ యూన్సీ లక్ష్మీ కూరగాయల మార్కెట్ ఏరియాలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది అనంతరం వైఎస్ఆర్సిపి ఆదోని పార్టీ పట్టణ అధ్యక్షుడు బి దేవా మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం లో భాగంగా ఆదోనిలో నేటి వరకు 67 వేల ప్రజల సంతకాల సేకరణ జరిగింది వైయస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు ఎక్కడ వెళ్లిన ప్రజల బ్రహ్మరథం పడుతూ స్వాగతం పలుకుతున్నారు ఈ కూటమి ప్రభుత్వం వల్ల చాలా నష్టపోయాం అని చెప్తా ఉన్నారు మరి ఈరోజు ప్రజల్లో తీవ్రంగా ఆగ్రహ జ్వాలాలు రగిలాయి చంద్రబాబు నాయుడు పిపిపి విధానాన్ని వెనక తీసుకోకపోతే ప్రజలతో పాటు వైఎస్ఆర్సిపి పార్టీ తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేస్తామని అన్నారు రాష్ట్రంలో ఒక సంక్షేమ పథకం కూడా అమలు చేయలేని చంద్రబాబు కు ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత ఒక మాట మాట్లాడడం చంద్రబాబు అలవాటే అలాగే ఆదోని నియోజకవర్గం లో ఉన్నటువంటి ఎమ్మెల్యే పార్థసారధి తక్షణమే రాజీనామా చేయాలి మెడికల్ కాలేజీ కోసం ఒకరు కూడా కూటమి నాయకులు నోరు ఎత్తని పరిస్థితి ఇలాంటి నాయకులు మేము ఓట్లు వేసిందని ప్రజలందరూ కూడా బాధపడతారు కావున కూటమి నాయకులు స్వచ్ఛందంగా మెడికల్ కాలేజ్ విషయమే మాట్లాడాలి లేని పక్షంలో ప్రజలు తీవ్రస్థాయిలో ఉద్యమిస్తారని అన్నారు. టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఉప్పర నారాయణ ప్రధాన కార్యదర్శి గాజుల నాగరాజ్ చిన్న వీరప్ప మసీద్ పుర ఇర్ఫాన్ భాష టౌన్ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఆర్ వి బాబు రమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులుకు మట్టిపై అవగాహన సదస్సు

**ఎమ్మిగనూరు, నవంబర్ 21, ప్రభాతవార్త :**



ఎమ్మిగనూరు మండల పరధిలోని జవహర్ నవోదయ విద్యాలయం నందు పీఎం శిరి, షిప్ పథకం క్రింద పాఠశాల నందు మట్టి నేల ఆరోగ్యముపై అవగాహన కార్య క్రమమును శుక్రవారం నిర్వ హించారు. విద్యార్థులకు మట్టి నేల ఆరోగ్యము, భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనాలను తీయు పద్ధతిని చూపించి, భూసార పరీక్ష చేయించుకోవడంలో ఉన్న లాభాలను విద్యార్థులకు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు తెలియజేశారు. వారు విద్యార్థులతో మాట్లాడుతూ పీఎం శిరి, షిప్ ప్రోగ్రామ్ కింద విద్యార్థులు 50 మట్టి నమూనాలను సేకరించి వారి పాఠశాల యందు విద్యార్థులే పరీక్ష చేసుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం వారు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రహిమాన్ భాష, సైన్స్ టీచర్ హరీష్ కుమార్, భూసార పరీక్షా కేంద్రములో పనిచేస్తున్న టువంటి వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ పి.అశోక్ వర్ధన్ రెడ్డి, వ్యవసాయ అధికారులు ఇందుమతి, నవీన, లావణ్య, కిరణ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి శివశంకర్, ఎఈఓ నర్సింహా, కె.వి.కె బనవాసి శాస్త్రవేత్త తేజ, రామాంజినేయులు, పి అశోక్ వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## పాము కాటుకు రైతు మృతి



**పత్తికొండ, నవంబరు 21, ప్రభాతవార్త :** పత్తికొండ మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామానికి చెందిన నాగన్న(50) అనే రైతు కాటుకు మృతి చెందాడు. శుక్రవారం తనకున్న ఐదు ఎకరల పొలంలో సేద్యం చేస్తు చెట్టు కిందకి వెళ్ళడంతో అక్కడ పాము వేయడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిత్యం పొలంలోనే పని చేసుకుంటు జీవనం చేసే నాగన్న హోతాత్తుగా మృతి చెందడంతో గ్రామంలో విషాధాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య ఒక కుమారుడు ఒక కూతురు కలరు.

## విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణి



**నంద్యాల హాస్పటల్, నవంబరు 21, ప్రభాతవార్త :** పట్టణంలోని నందమూరి నగర్ స్టార్ సొసైటి ద్వారా నిర్వహించబుడుతున్న జాతీయ బాల కార్మిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు రాఖీ శిలాస్ జన్మదిన సంధర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్ళను పంపిణి చేశారు. 2022 నుండి ప్రభుత్వం నుండి నిధులు రాకున్న పేద విద్యార్థుల కోసం బాల కార్మిక పాఠశాల నడపడం హార్షణీయమని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జడ్.కళ్యాణ్, ఫాస్టర్ కిరణ్, సోసైటి నిర్వాహకుడు గద్దం సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్సిడిసి కార్యక్రమంపై అవగాహన



**పత్తికొండ, నవంబరు 21, ప్రభాతవార్త :** ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన ఎల్సిడిసి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 11వ వార్డులో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు కుష్టు వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని విచారణకు వచ్చిన వైద్య సిబ్బందికి సహాకరించాలని, ఇంటిలో గల సభ్యులకు ఎవరికైనా తెల్లటి మచ్చలు గాని కనురెప్పలు రాలిపోవడం గాని చర్మవ్యాధులుగా ఉన్నట్లు అయితే వచ్చిన వైద్య సిబ్బందికి తెలియజేసి పేరు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. ఇందులో భాగంగా ఆ ప్రాంతంలోని డ్రైడే ఫ్రైడే సంధర్భంగా లార్వాను కనుగొని అటు వంటి వాటర్ కంటైనర్ శుభ్రం చేయడం జరిగిందని ఈ కార్యక్రమం 30వ తేదీ వరకు జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సాయిబాబా, ప్రకాష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలను కాపాడుకుందాం..!

**తుగ్గలి, నవంబరు 21, ప్రభాతవార్త :**



మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలని చంద్రబాబు సర్కార్ చేస్తున్న కుటిల యత్నాన్ని తిప్పికొట్టి వాటిని కాపాడు కుందామని వైఎస్సార్సీపి నాయకులు గిరిగెట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, పణి భూషణ్‌రెడ్డి లు పిలుపు నిచ్చారు. శుక్రవారం పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ఆదేశ్యాల మేరకు మండల పరిధిలోని గిరిగెట్ల గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సంతకాల సేకరణకు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన 17 వైద్య కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడం ధుర్మార్గమని మండిపడ్డారు. దీని వలన పేదలకు వైద్య విద్య అందదని వారు పేర్కొన్నారు. కోటి సంతకాల ఉద్యమంతో బాబుకు బుద్ధిచెబుదామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు చేసి ప్రజలకు మేలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పద్మావతి, పెద్ద రంగన్న, చెరువు రంగస్వామి, నాగేష్, ఈశ్వరప్ప, లక్ష్మన్న, గొర్ల రంగస్వామి, మాలేశ్వరమ్మ పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేయాలి




**కర్నూలు విద్య, నవంబరు 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రాథమిక మత్స్య సహకార సంఘాలు గత కొన్ని దశాబ్దాలుగా వివిధ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని మత్స్యకార సొసైటిల అభివృద్ధికి ఎటువంటి ప్రణాళికలు లేకుండా ఈరాష్ట్రంలో వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని వారి సంక్షేమాన్ని వారికిరావాల్సిన విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వాటాలను కోల్పోతున్నారని ఈరోజు రా ష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మత్స్యసహకార సంఘాల అభివృద్ధికి ఒక నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించాలని ఆయన కోరారు. ఈమేరకు శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకొని నగరంలోని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా కార్యాలయ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ జిల్లా ప్రాథమిక మత్స్య సహకార సంఘాలు కొత్తవి ఏర్పాటు చేయాలని అలాగే సొసైటిల్లో చనిపోయిన సభ్యులను తొలగించి నూతన సభ్యులకు అవకాశం కల్పించాలని అలాగే గత టిడిపి ప్రభుత్వ హాయంలో కర్నూలు జిల్లాలో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వేట ద్వారా వచ్చిన చేపలను మార్కెంటింగ్ చేసుకోవడానికి కర్నూలు పట్టణంలో మోడ్రన్ చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించిందని ఇంతవరకు అతిగతిలేదని అలాగే చేపల వేట నిషేదసమయంలో మత్స్యకార సభ్యులకు చెల్లించే మత్స్యకార భరోసా రాయలసీమ జిల్లాలకు కూడ వర్ధింపచేయాలన్నారు. సంఘం నాయకులు బెస్త పుల్లయ్య, తెలుగు నాగరాజు, తెలుగు కన్న, వినయ్, మహిళా నాయకురాళ్లు బెస్త పావని, బెస్త మమతలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో రైతులు త్రీవంగా నష్టపోయారు



**కర్నూలు, నవంబర్ 21, ప్రభాతవార్త :** ఉల్లి, పత్తి, మిర్చి రైతులకు సరైన మద్దతు ధర లేక రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో రైతులు ఇక్కట్లు పడుతున్నారనీ కర్నూలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల భరత్ కుమార్ కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్న దాత సుఖీభవ పేరుతో రైతులకు అరకొరగా నిధులు కేటాయించారనీ.కూటమి ప్రభుత్వం లో ఆర్బికెలను నిర్వీర్యం చేసి, రైతులకు అవగాహన కల్పించ లేకపోయారని తెలిపారు.కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులకు మద్దతు ధర 1,200 ఇచ్చిన ఇప్పటికీ రైతుల ఖాతాలో జమ కాలేదు.రైతు సమస్యలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిర్లక్ష్యం చేస్తున్నారనీ, అరటి, మామిడి పండ్ల రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి గా రైతుల సమస్యలపై సమీక్ష చేయకుండా అభివృద్ధి పేరుతో ఇతర కార్యక్రమాలకు హాజరు అవుతున్నారని ధ్వజమెత్తారు.రైతులంటే చంద్రబాబు కు చిన్న చూపు, 17 నెలల్లో రైతులకు గిట్టుబాటు ధర లేక అప్పులతో ఆత్మహత్య చేసుకుంటున్నా కూటమి ప్రభుత్వానికి అమరావతి భవనాల మీద ఉన్న ప్రేమ రైతుల పట్ల లేదన్నారు.గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో రైతులకు పెద్ద పీట వేసి రైతులకు ఇన్పుట్ సబ్సిడీ తోపాటు ఈ క్రాప్ ఇన్సెన్స్ ఇచ్చారనీ గుర్తు చేశారు.రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలతో పాటు యూరియా బస్తాలను కూడా సరఫరా చేశారనీ తెలిపారు.

## శ్రీమఠంలో కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

– బంగారు పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే

**మంత్రాలయం, నవంబరు 21, ప్రభాతవార్త;**



పవిత్ర తుంగభద్ర నది తీరాన వెలిసిన సుప్రసిద్ధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థం శుక్రవారం ఉదయం నెల్లూరు జిల్లా కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి విచ్చేశారు. వీరు శ్రీమఠం కారిడార్‌కు చేరుకోగానే పీఆర్‌వో ఐ.పి.నరసింహమూర్తి, సహాయ పీఆర్వో హొన్నల్లి వ్యాసరాజు ఆచార్ ఘన స్వాగతం పలికారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని కుంకుమార్చన, మహామంగళహారతి, వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనంను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం శ్రీమఠంలో నిర్వహించిన బంగారు పల్లకిసేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొన్నారు. తదనంతరం వీరికి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ స్వామీజీ శేష వస్త్రము, శ్రీ రాఘవేంద్రస్వామి మెమోంటో, ఫల, మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ద్వార పాలకులు ప్రకాష్‌స్వామి, పవన్‌స్వామి, అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థినీ సుగుణ



**పగిడ్యాల, నవంబరు 21, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మాపురం అంచవద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 8వతరగతి చదువుతున్న సుగుణమాక్ అసెంబ్లీకి ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. నియోజకవర్గం నుండి ఒక్కొక్కరిని చొప్పున ఎంపికచేయగా నందికొట్కూరు నియోజకవర్గం నుండి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 8వతరగతి చదువుతున్న సుగుణ ఎంపికకావడం హర్షనీయమన్నారు. 26వతేదీన అమరావతిలో మాక్ అసెంబ్లీ నిర్వాహించే కార్యక్రమంలో సుగుణ పాల్గొంటారనీ మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్ తెలిపారు. విద్యార్థి సుగుణను గురుకులం బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ, మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్, గురుకులం బాలికల పాఠశాల ఉపాధ్యాయిని బృంతం అభినందించారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో.. అటకెక్కిన సమయపాలన

**- పర్యవేక్షన చేయాల్సిన అధికారులు ఎక్కడో...!**
**- పనులు కోసం పడిగాపులు కాస్తున్న ప్రజలు**

**బండిఆత్మకూరు, నవంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రతి గ్రామ పంచాయితీలో ఒక సచివాలయం ఏర్పాటు చేసింది. అందులో దాదాపు పదిశాఖలకు చెందిన అధికారులను నియమించి ప్రజలకు సేవలు అందించాలని ఆదేశాలున్నాయి. ప్రతి ఉద్యోగి ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు సమయపాలన పాటించి విధులు నిర్వహించాలి. కానీ బండిఆత్మకూరు మండలంలో మండల ప్రభుత్వ కార్యాలయాలు మొదలుకొని గ్రామ సచివాలయాల వరకు సమయపాలన అటకెక్కింది. ఉదయం 11 గంటలు దాటినా చాల ప్రభుత్వ కారా ్యలయాల్లో ప్రజలకు ఖాళీ కుర్చీలు దర్శన మిస్తున్నాయి. మండల కేంద్రంలోనే సమయపాలన లేకపోతే గ్రామాల్లో ఎలా ఉంటుంది ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామ సచివాలయాలపై తనిఖీచేయాల్సిన అధికారులేవరో వారు ఎక్కడుంటారో తెలియని పరిస్థితి. అడిగేవారు లేక




చెప్పేవారు లేక సచివాలయాల్లో సమయపాలన ఇష్టారాజ్యంగా మారింది. ఏ అధికారి ఎప్పుడు వస్తారో తెలియక ప్రజలు పనులు మానుకొని కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి నదయస్థితి నెలకొంది. ఆశ్చర్యం ఏమిటంటే పర్యవేక్షణ లోపించ దంతో మండలంలోని 20 గ్రామపంచాయితీల్లో సచివాలయాలకు ఉదయం అలస్యంగా రావడం సాయంత్రం 3 గంటలకే ఇంటికిపోవడం జరుగుతుంది. సచివాలయాల్లో నిర్వహించాల్సిన ముఖ్యమైన మూమెంట్ రిజిష్ట్రర్ కూడ నిర్వహించకపోవడం బాధకరం. మండలంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో హాజరుపట్టికలో నెలకు ఒకసారి సంతకాలు చేసే అధికారులు ఉండడం శోచనీయం. ఇంత తతంగం జరుగుతున్నా జిల్లాకేంద్రం అతిసమీపంలో ఉన్నా అధికారుల్లో భయం ఎందుకు లేదో అని ప్రజలు గుస గుసలాడుతున్నారు. ఇప్పటికైనా నంద్యాల జిల్లా కలెక్టర్ బండిఆత్మకూరు మండలంలో సమయపాలన పాటించని అధికారులపై పర్యవేక్షణ చేయని అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని మండల ప్రజల కోరుతున్నారు.

# నందమూరినగరు పాఠశాల.. ఆకస్మిక తనిఖీ

**: విద్యార్థుల వసతులపై అగ్రహం**
**: హెడ్మాష్టరు, యంఈఓకు సోకాస్ నోటీసు**

**నంద్యాల, నవంబరు 21, ప్రభాతవార్తప్రతినిధి:** నంద్యాల మున్సిపాల్టి పరిదిలోని ఉన్న జెడ్పి హైస్కూలును జిల్లా కలెక్టరు రాజకుమారి అకస్మికంగా తనికీ చేసి అక్కవ విద్యార్థులు, పడుతున్న ఇబ్బందులు, అపరిశుబ్రతలు, గుడ్లుఇవ్వక మూడు రోజులు కావడముతో హెచ్‌యం, యంఈఓకు సోకాజ్ నోటీసు జారీ చేశారు. శుక్రవారము నంద్యాల మున్సిపాల్టి పరిదిలోని నందమూరి నగరులోఉన్న జెడ్పి హైస్కూలును కలెక్టరు రాజకుమారి శుక్రవా రము అకస్మికంగా తనికీ చేశారు. అక్కడ పాఠశాల పరిసరాల్లో అమె కలియ తిరిగారు. అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పరిసరాలు అపరిశుబ్రంగా ఉండటముతో ప్రదానోపాద్యా యులుపై అగ్రహం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థినీలకు మరుగుదొడ్లు ఉన్నప్పటికి



విద్యార్థుల మరుగుదొడ్లు అపరిశుబ్రంగా ఉన్నాయని దీనితో విద్యార్థులు బహుర్భాభూమికి బయటకు వెళ్లుతున్నామని కలెక్టరు విద్యార్తులు విన్నవించారు. అలాగే విద్యార్తులకు మూడు రోజుల నుండి గుడ్లు ఇవ్వలేదని కలెక్టరు ముందు వాపోయారు. అనంతరము కలెక్టరు జిల్లా పరిషత్ హైస్కూలుతరగతి గదులు హైస్కూలు ప్రాంగణంలో స్వయంగా కలియ తిరగి అక్కడున్న సమస్యలను గుర్తించారు. పాఠశాల పరిసరాలు చాలా అపరిశుబ్రంగా ఉండటముతో ప్రదానోపాద్యాయులుపై అగ్రహము వ్యక్తం చేశారు. దీనితో కలెక్టరు హెచ్‌యంకు యంఈఓకు వెంటనే సోకాజ్ నోటీసు జారీ చేశారు.

# జగన్ కోర్టు హాజరు నాటకం విఫలం.. తిక్కారెడ్డి విమర్శ

**కర్నూలుహాస్పిటల్ నవంబర్ 21 ప్రభాతవార్త :**



వై.సి.పి. అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్రెడ్డి నాంపల్లి సి.బి.ఐ. కోర్టుకు నిన్న హాజరైన విషయం పై తెలుగుదేశం పార్టీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. కోర్టుకు వ్యక్తిగత హాజరు నుండి మినహాయింపు పొందేందుకు జగన్ ప్రయత్నించారని, అయితే కోర్టు ఆమోదించకపోవడంతో ప్రయత్నం విఫలమైందని తెలిపారు. పార్టీ క్యాడర్‌ను పెద్దఎత్తున హైదరాబాద్‌కు తరలించి కోర్టు వద్ద గందరగోళం సృష్టించి, దృష్టి మరల్చి మినహాయింపు పొందాలని యత్నించారని, కానీ పోలీసులు తీసుకున్న చర్యల వల్ల జగన్ ఆలోచన నీరుగారిందని చెప్పారు. జగన్ అనుచరుల ప్రవర్తన ప్రజలకు ఏమాత్రం నమ్మకం కలిగించలేదని, కార్యక్రమానికి వచ్చిన వారిలో చాలా మంది పేయిడ్ ఆర్టిస్టుల్లానే కనిపించారని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్, ఇప్పటికీ అదే ధోరణిని కొనసాగిస్తున్నారని తిక్కారెడ్డి ఆరోపించారు. న్యాయవ్యవస్థకు షెడ్యూల్ సూచిస్తూ వ్యవస్థలను అవహేళన చేసినట్లు ఆయన విమర్శించారు. ఇదే అహంకారం, అరాచక పాలన వల్లే ప్రజలు వై.సి.పి.ను 151 సీట్ల నుండి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. వ్యవస్థలను భయపెట్టే ప్రయత్నం మానుకోవాలని, న్యాయవ్యవస్థ గౌరవించాల్సిన అవసరం ఉందని తిక్కారెడ్డి సూచించారు.

# ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం

**- ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసింది... శూన్యం : ఆలూరు ఎమ్మెల్యే**

**హొళగుంద, నవంబరు21, ప్రభాతవార్త;** ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హొళగుంద మండలంలోని కొత్తపేట, నెరణికితండా, నెరణికి, ఎల్లార్తి గ్రామాల్లో వైకాపా ప్రభుత్వం చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే విరుపాక్షి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా గ్రామాల వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అలాగే కొత్తపేట గ్రామంలో వెలిసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి ఎమ్మెల్యే విరుపాక్షి కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొత్తపేట గ్రామంలో నాడు-నేడు పథకం ద్వారా నిర్మించిన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ నిర్మాణ పనులు మధ్యలోనే ఎందుకు ఆపేశారని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అప్పటి కాంట్రాక్టర్ అరకొరగా భవన నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. అలాగే ప్రస్తుతం కొత్తపేటలో విద్యార్థులతో నడుపుతున్న పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాల పైకప్పు ప్రమాదకరంగా ఉందన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనాన్ని అందించి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం నెరణికి గ్రామంలో వెలిసిన దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 18 నెలల పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని, ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అంటూ అన్నదాత సుఖీభవ గానీ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలు అర్హులైన వారికి అందడం లేదని ఎద్దేవా చేశారు. ఆర్భాటాలకే కూటమి ప్రభుత్వం పథకాలను ప్రవేశపెట్టిందని, ఎక్కడా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కొత్త పింఛన్ల ఊసే లేదన్నారు. ఉన్న పింఛన్లనే తొలగించారని ఆరోపించారు. సీఎం చంద్రబాబునాయుడుకు 40 ఏళ్ల అనుభవం ఉన్నా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా తాగునీటి వసతి, రోడ్డు, గ్రామాల్లో



మౌలిక వసతులను కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందన్నారు. వైద్య విద్యను నిరుపేదలకు అందకుండా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. అనంతరం ఎల్లార్తి గ్రామంలో అయ్యప్ప భక్తులు ఏర్పాటు చేసిన పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే విరుపాక్షి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు బుసినే శ్రీనివాసులు, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, సీనియర్ నాయకులు శేషప్ప, ఎంపీపీ నూర్జహాన్ తనయుడు ఈసా, వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె.గిరి, సర్పంచులు రామునాయక్, దర్గప్ప, సోము, ఇంగళదహాల్ ఎంపీటీసీ మల్లికార్జున, బీజీహళ్లి శివన్న, మంజునాథ్‌నాయక్, కొత్తపేట రామయ్య, వందవాగిళి శేషప్ప, శేఖర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

# సిక్యాంపు రైతు బజార్‌లో దళారుల ప్రవేశంపై కఠిన చర్యలు తప్పవు




**కర్నూలు, నవంబర్ 21 ప్రభాతవార్త;** సి క్యాంపు రైతు బజార్ పరిధిలో దళారుల రాకపోకలను పూర్తిగా నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోనున్నట్లు త్రీ టౌన్ సీఐ శేషయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టేట్ ఆఫీసర్ కళ్యాణి,తో పాటు రైతు బజార్‌ను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ రైతు బజార్లో రైతులు మాత్రమే ఉండాలని, తూకాలలో ఎలాంటి అవకతవకలు జరగకూడదని, బోర్డు మీద ఉన్న ధరలు కు మాత్రమే కూరగాయలు అమ్మాలని సూచించారు. రైతు బజార్‌లో నిజమైన రైతులు మాత్రమే అమ్మకాలు చేయాలని, కష్టపడి పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు న్యాయమైన ధర లభించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని సీఐ శేషయ్య తెలిపారు. దళారుల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతులపై దౌర్జన్యం చేయడం తగదని ఇకపై రైతు బజార్ పరిధిలో దళారులు ప్రవేశించే ప్రయత్నం చేసినట్లయితే కఠినమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. రైతులను వేధించడం, అడ్డంకులు సృష్టించడం, దౌర్జన్యాలకు పాల్పడడం వంటి చర్యలను అస్సలు సహించబోమని హెచ్చరించారు, రైతుల హక్కులను రక్షించడంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

**: మాజీ ఎమ్మెల్యే, ఆదోని టిడిపి ఇంచార్జ్, మీనాక్షి నాయుడు**




**ఆదోని నవంబర్ 21 ప్రభాతవార్త :** ప్రజా సమస్యలు పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ అని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి ఇన్చార్జ్ మీనాక్షి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ప్రజల నుండి పలు సమస్యల పై అర్జీలను స్వీకరించారు. ముఖ్యంగా ఆదోని నియోజవర్గంలో పరిధిలోని గ్రామాల్లో వీధిలైట్లు, శానిటేషన్, నీటి సమస్య, రోడ్ల ఏర్పాటు, భూ ఆక్రమణలు, రెవెన్యూ, విద్యుత్ సమస్యలు, ఇంటి స్థలాలు, పక్కా ఇండ్ల కొరకు, తదితర అంశాలపై పలువురు అర్జీల రూపంలో వినతి చేశారు. ప్రజా దర్బారు లో ప్రజలు ఇచ్చిన అర్జీలు, ఫిర్యాదు పత్రాలను మాజీ ఎమ్మెల్యే, ఆదోని టిడిపి ఇన్చార్జ్ మీనాక్షి నాయుడు, పరిశీలించి, పరిష్కరించ గల అర్జీల పై నిర్లక్ష్యం చేయకుండా, శ్రద్ధ వహించా లని సంబంధించిన శాఖ అధికారులకు సూచించారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

# పిల్లలు అన్ లైన్ భద్రత పై అవగాహన సదస్సు

**కర్నూలు నవంబర్ 21 ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా సౌజన్యముతో జిల్లా న్యాయ సేవా సదన్ కర్నూలు నందు ఏర్పాటు చేసిన పిల్లల ఆన్లైన్ భద్రతా విధానాలు సైబర్ క్రైమ్స్ పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి. జడ్జి మాట్లాడతూ సమాజంలో ఆన్ లైన్ లలో పిల్లలపై అనేక రకాలుగా లైంగిక దోపిడీ లు జరుచున్నాయని తెలిపారు. వాటిని ఎలా ఎదుర్కొని పిల్లలను రక్షించాలన్నది ఈ సదస్సులో వివరిస్తారని తెలిపారు. కర్నూలు సైబర్ క్రైమ్ సీఐ వేణుగోపాల్ రెడ్డి ఆన్లైన్లో జరిగే మోసాల ను గురించి వాటిని ఎలా ఎదుర్కోవాలి అని వివరించారు. బెంగళూరు నుంచి వచ్చిన శుభ్రత్ కుమార్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ పిల్లలపై ఆన్లైన్ లో జరిగే లైంగిక దోపిడీని ఎలా ఎదుర్కోవాలో చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ వారికి, జువేనేల్ జస్టిస్ బోర్డు మెంబర్స్ కి, చిల్డ్రన్స్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారికి, రెవెన్యూ డిపార్ట్మెంట్ వారికి పోలీస్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హెడ్ మాస్టర్లకు, ఎంఈఓ లకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాశ్వతంలో లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, కర్నూలు న్యాయ వాదుల సంఘము అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, కోఆర్డినేటర్ ఆఫ్ చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ కే. వి. కొండప్ప, కర్నూలు, నంద్యాల, కోడుమూరు ఐసిడిఎస్ సిడిపిఓలు కర్నూలు, నంద్యాల ఐసిడిఎస్ డీసీపీఓలు, పోలీస్ ఆఫీసర్స్, గవర్నమెంట్ బాయ్స్




అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ హుస్సేన్ భాష, డిపిఓ దివాకర్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శివరాం, సిడబ్ల్యుసి చైర్మన్ జుబేదా బేగం, కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, దిశ సిఐ రామా నాయుడు, బచ్పన్ బచావో చిల్డ్రన్స్ ఎన్జీవో మోనిక, లీగల్ కమిటీ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, స్కూల్ హెడ్మాస్టర్లు, మండల విద్యాధికారులు, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఛోరీ కేసులో ముద్దాయి అరెస్టు



**వెలుగోడు, నవంబరు 21, ప్రభాతవార్త:** ఈ నెల 19న వెలుగోడుకు చెందిన కుప్పల రమణయ్య ఇంట్లో జరిగిన చోరీ కేసులో ముద్దాయిని కుప్పాల రెడ్డయ్య ని అరెస్టు చేసినట్లుగా ఎస్సై తెలిపారు. పట్టణ:లో పానీపూరి దుకాణం నిర్వహించే రమణయ్య ఇంటిలో జొరబడి తాళాలు పగులగొట్టి లక్ష 95 వేలు విలువ గల సొత్తును ఎత్తుకెళ్ళిన కేసులో దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం వెలుగోడు గ్రామము ఊరుబయట ఎస్ఎన్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ దగ్గర గల రెడ్డు పక్కన ముద్దాయిని అరెస్టు చేసి అతని నుండి దొగలించిన 60 వేలు నగదు, నెక్లెస్, మొత్తం రూ.1,95,000లు విలువగల సోత్తును స్వాదీనం చేసుకొని ముద్దాయిని కోర్టు హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

# రైతాంగానికి సాగునీరు అందించడమే కూటమీ ప్రభుత్వ లక్ష్యం-ఎమ్మెల్యే బీవీ

**- జీడీపీ కుడి కాలువకు సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే**

**గోనెగండ్ల, నవంబరు, 21, ప్రభాతవార్త :** జిల్లాలోని రైతాంగానికి పంటలు రైతుల చేతికి అందేవరకు సాగునీరు అందించడమే కూటమీ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం గాజులదిన్నె ప్రాజెక్టులోని నీటికి గంగాపూజ చేసి ప్రాజెక్టు కుడి కాలువ ద్వార ఆయకట్టు రైతులకు సాగు నీటిని ఎమ్మెల్యే బీవీ విడుదల చేశారు. కుడి కాలువకు 100 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఈ ఏడాది రబీ సీజన్‌లో ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టులో 3టీఎంసీల నీరు ఉన్నందుకు ప్రస్తుతం 13వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామన్నారు. పంటలు రైతుల చేతికి అందే వరకు సాగు నీరు అందిస్తామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే ఆర్‌డీఎస్, ఎండ్రేవుల పనులు చేపడుతామ న్నారు. గత వైసీపీ పాలనలో ముందుచూపులేకుండా అధికారులు, నాయకులు తీసుకున్న నిర్ణయాలవల్ల జీడీపీ సాగు నీటి ప్రాజెక్టు కాస్తా తాగునీరు ప్రాజెక్టుగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రరెడ్డి, ఈఈ



పాండురంగయ్య, డీఈ సుబ్బరాయుడు, ఏఈ మహ మ్మద్ ఆలీ, ఉగ్రనరసింహుడు, టీడీపీ నాయకులు తిరుపతయ్యనాయుడు, నజీర్‌సాహెబ్, రామాంజినేయు లు, బేతాళ బడేసాబ్, మురళినాయుడు, ఐరన్‌బండ భాషా, జీడీపీ సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లి కార్జునగౌడ్, రామనరసప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

**- రాయలసీమకు ఇక్కడి నుంచే చేప పిల్ల సరఫరా : బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎమ్మెల్యే ఎమ్మిగనూరు.**

రాష్ట్రంలో కోనసీమలో మాదిరి చేపపిల్లలను తయారు చేసి గాజులదిన్నె ప్రాజెక్టులోని మత్స్య సంఘం నుంచి రాయలసీమాలోని అన్ని జిల్లాకు చేప పిల్లను తయారు చేసి పంపిణీ చేసేవిధంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సం సందర్భంగా మన చెరువు మన సీడ్ పథకం కింద గాజులదిన్నె ప్రాజెక్టులోని ఫాండ్స్ లో గాజులదిన్నె మత్స్యకార్మికులు స్వంత ఖర్చులతో తయారు చేసుకున్న 25 లక్షల చేప పిల్లలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మత్స్యశాఖ డీడీ రంగనాథ్‌బాబు, వదిలారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య సంఘం స్వంతంగా రూ.5లక్షల్లో తయారు చేసుకున్న చేప పిల్లలు నేడు రూ.30 లక్షలు విలువ చేస్తున్నాయని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఎంపిక కాబడిన గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్య సహకార సంఘం ,సీ బెళగల్, చిన్న తుంబళం, సంఘాలకు మేనేజ్‌మెంట్ కాస్ట్‌కింద ఒక్కొక్కరికి రూ.2,54000 చెక్కులను అందజేస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా మత్స్యకార్పోరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, పోతుల శేఖర్, తహశీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో మణిమంజరి, జీడీపీ మత్స్య సంఘం అధ్యక్షుడు రంగస్వామి, కార్యదర్శి మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గంగ 23వ ఉప కాల్వకు గండి

**-పంట పొలాలపై నీరు వరదలా పొడుతుండడంతో ఆందోళన చెందుతున్న రైతులు**

**రుద్రవరం, నవంబరు 21, ప్రభాతవార్త:**



తెలుగుగంగ 23వ ఉప కాల్వ కరకట్ట కోతకు గురై గండిపడింది. దీంతో కాల్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు పంట పొలాలపై వృధాగా వరదా ప్రవహిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని టి లింగందిన్నె గ్రామ పరిధిలో గల 22వ ఉప కాల్వ కరకట్ట కోతకు గురై గండిపడి కాల్వలో ప్రవహిస్తున్న సాగునీరు పంట పొలాలపై పారుతుండడంతో రైతులు తమకు చేతికి అందివచ్చిన పంట నష్టం జరిగే ప్రమాదం నెలకొంటుందని తీవ్ర అందోళనకు గురవుతున్నామన్నారు. గ్రామానికి చెందిన రైతులు జేసిబి సహాయంతో గండిపడిన ప్రదేశంలో కొంతమేర మరమ్మతులు చేపట్టి పంట పొలాలపైకి నీరు రాకుండా తాత్కాలికంగా జాగ్రత్తలు తీసుకున్నారు. వెంటనే గంగ అధికారులు స్పందించి కాల్వకట్ట మరలా గండిపడకుండా కట్టుదిట్టమైన మరమ మ్మత్తులు చేసి తమ పంటపొలాలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**మిడుతూరు, నవంబర్ 21, ప్రభాతవార్త:** మండల పరిదిలోని తలముడిపి గ్రామ సమీపంలో కుందూనది బ్రిడ్జిపై ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో బోయ వెంకటేశ్వర్లు(34) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శుక్రవారం తెల్లవారుజామున నందికొట్కూరు నుంచి నంద్యాలకు వెళుతుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నంద్యాల మిల్క్‌డైరీ పై తగిన చర్యలు తీసుకుంటాం.. లోకేష్ హామీ

**నంద్యాల, నవంబరు 21, ప్రభాతవార్తప్రతినిధి**



నంద్యాలలో ఉన్న విజయా మిల్క్‌డైరీ జరుగుతున్న అవినీతిపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఒకే చెప్పారు. శుక్రవారము ఆళ్లగడ్డయువనాయుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌ను కలిశారు. అక్కడ నంద్యాల విజయాడూరీలో చైర్మన్ మరియు డైరెక్టర్లు చేస్తున్నఅవినీతి అక్రమాలను మంత్రికి వివరించారు. మిల్క్ పాల ప్యాకెట్‌పై ప్రజలపై భారము మోపి సంవత్సరానికి రూ 7కోట్లు పాల ప్యాకెట్లపై సంపాదిస్తున్నారని గత కొద్ది రోజుల కిందట విజయాడైరీ ని స్థాపించిన నందమూరి తారకరామారావు గారిశిలా పలకను కిల్వోలో పడేయడముతో మేము అక్కడికి వెళ్లి అదికారులుతో కోట్లాడి మళ్లీ శిలాపలకాన్ని అక్కడ పెట్టించడము జరిగిందని తెలియ జేవారు. విజయాడైరీకి సంబందించిత 35 ఎకరాలు భూమి ఉందని అ భూమిని వైసిపి చౌర్మన్ గత వైసిపి హయాంలో వారిపై అన్‌లైన్ చేపించుకోవడము జరిగిందని దాదాపు 350 కోట్ల రూపాయల విలువైన భూమి ఇప్పుడు ఈ భూమిని ప్రభుత్వానికి చేరేలా చర్యలు తీసుకోవాలని గతంలో ఈ విషయంపై సియం గారి దృషికి కూడా తీసుకెళ్లడము జరిగిందని తెలిపారు.

# పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన .. జిల్లా ఎస్పీ

**కర్నూలు నవంబర్ 21 ప్రభాతవార్త ప్రతినిధి :** కె. నాగలాపురం పోలీసు స్టేషన్ ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్ర వారం వార్షిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్ లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. కేసులు నమోదుచేసి శిక్షలు పడేవిధంగా చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులను చేధించి రికవరీలు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరాలపై, మహిళల చట్టాల పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కె




.నాగలాపురంలోని శ్రీ సుంకులమ్మ పరమేశ్వరి అమ్మవారిని జిల్లా ఎస్పీ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ఎస్పీ తో పాటు కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్ , డిసిఆర్ బి సిఐ గుణశేఖర్ బాబు, కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు, కె. నాగలాపురం ఎస్సై శరత్ కుమార్ రెడ్డి ఉన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీ..

**: ఆపస్మారక స్థితిలో.. వ్యక్తి**

**కర్నూలు నవంబర్ 21 ప్రభాతవార్త ప్రతినిధి :** కర్నూలు పట్టడంలోని జొహరాపురం రోడ్డు లో బైక్ పై వెళుతున్న సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ను గుర్తు తెలియని వాహనం డీ కొనిందని ట్రాఫిక్ సీఐ మనసురుద్దీన్ తెలిపారు. తలకు తీవ్ర గాయాలై ఆపస్మారక స్థితిలో పడివున్న అతన్ని.. అటుగా వెళుతున్న సూర్య తేజ అనే వ్యక్తి గమనినిచ్చి ఆటోలో జిజిహెచ్ హస్పిటల్ కు తరలించానన్నాడు. భాధితుంది తల్లి ఎస్పీ బంగ్లా లో వంటామనిషి గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

